RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా నిజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా నిజన్

18వ వసంతంలోకి

EDITOR :Boorla Venkatesham KARIMNAGAR VOLUME:18 ISSUE:18 WEDNESDAY ,MAY 20,2026 PAGES:20 COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :18 బుధవారం, మే 20, 2026, పేజీలు -20 వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

# పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యం



తెలంగాణ పత్రిక ప్రతినిధి

పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దేవాదుల, ఎస్ఎల్‌బీసీ, సీతారామ ప్రాజెక్టులతో సమాన ప్రాధాన్యం ఇస్తామని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో పాలమూరు-రంగారెడ్డి పనులు 90శాతం పూర్తి అయ్యాయన్నది అసత్యమని అన్నారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని - మిగతా2లో

# తెలంగాణ కేబినేట్ భేటీ 23కు వాయిదా

తెలంగాణ పత్రిక ప్రతినిధి

రాజధాని వెలుపల మరోమారు తెలంగాణ కేబినేట్ సమావేశం జరగనుందని సమాచారం. గతంలో మేడారంలో కేబినేట్ నిర్వహించిన సిఎం రేవంత్ రెడ్డి తాజాగా ఇప్పుడు యాదగిరిగుట్టలో కేబినేట్ నిర్వహించేందుకు ఆదేశంచినట్లు తెలుస్తోంది. ఈ నెల 21 జరగాల్సిన కేబినేట్ సమావేశాన్ని 23న నిర్వహించాలని, అదికూడా యాదాద్రిలో నిర్వహించనున్నట్లు సమాచారం. 21 నుంచి సరస్వతీ అంత్య పుష్కరాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాజకీయాలు, పాలనా నిర్ణయాల్లో ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహణ అత్యంత ఆసక్తికరంగా మారింది. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం కాకుండా, కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేసే యోచనలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కారణం ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసరలో ప్రారంభం కానున్న 'సరస్వతి అంత్య పుష్కరాలు' కావడం గమనార్హం. అదే సమయంలో, ఈ కేబినెట్ భేటీని కేవలం వాయిదా వేయడమే కాకుండా, - మిగతా2లో



# భారత పర్యటనకు రష్యా అధ్యక్షుడు పుతిన్..

- సెప్టెంబర్‌లో రానున్న రష్యా అధ్యక్షుడు
- ధృవీకరించిన రష్యా అధ్యక్ష భవనం
- బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనున్న పుతిన్
- ఏడాది వ్యవధిలో రెండోసారి భారత్‌కు


2

# ఎబోలా అరికట్టే చర్యలు బలోపేతం

తెలంగాణ పత్రిక ప్రతినిధి

ఎబోలా వ్యాప్తిని నివారించడానికి ముందుజాగ్రత్త చర్యలను బలోపేతం చేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. దీనిలో భాగంగా వ్యాధి వ్యాప్తి చెందిన ఆఫ్రికా ప్రాంతాల నుండి వచ్చే విమాన ప్రయాణికులను పరీక్షించడంతో పాటు, వీసాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా రాయబార కార్యాలయం వెల్లడించింది. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డిఆర్ సి)లో ప్రాణాంతకమైన ఎబోలా వ్యాప్తిని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు హెచ్ ఒ) - మిగతా2లో



# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

తెలంగాణ పత్రిక ప్రతినిధి

తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కొత్తగా ఎం పాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కొత్త హెల్త్ స్కీమ్ అమల్లో - మిగతా2లో




# తమిళనాడులో ఇగ కొత్త

## రూల్రూ.1000 లంచానికి లక్ష బహుమతి సీఎం విజయ్ సంచలన నిర్ణయం..

తెలంగాణ పత్రిక ప్రతినిధి

వెయ్యి రూపాయలు లంచం అడిగితే.. ఏకంగా లక్ష రూపాయల బహుమతి.. వినడానికి నమ్మశక్యంగా లేకపోయినా.. ఇప్పుడు ఇది అక్షరాలా నిజం. తమిళనాడు కొత్త ముఖ్యమంత్రి దళపతి విజయ్ అవినీతిపై యుద్ధం ప్రకటించారు. ప్రభుత్వ ఆఫీసుల్లో లంచాలకు చెక్ పెట్టేందుకు, ఏకంగా సామాన్య ప్రజలనే అవినీతి నిరోధక సైన్యంగా మార్చేస్తూ కొత్త - మిగతా2లో



# పీఎఫ్ ఉన్నవారికి త్వరలో కేంద్రం నుంచి శుభవార్త..




తెలంగాణ పత్రిక ప్రతినిధి

ఈపీఎఫ్ఓ ఉద్యోగులకు త్వరలో కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించనుంది. కనీస పెన్షన్ పరిమితిని పెంచేందుకు రెడీ అవుతోంది. ప్రస్తుతం కనీస పెన్షన్ పరిమితి రూ.వెయ్యి ఉండగా.. రూ.3 వేలకు పెంచే అవకాశముందని తెలుస్తోంది. అయితే పెన్షన్ పొందేందుకు కొన్ని షరతులు - మిగతా2లో

# పాలమూరు ప్రాజెక్టుల పై బిఆర్ఎస్ మోసం

తెలంగాణ పత్రిక ప్రతినిధి

బీఆర్ఎస్ నేతలకు పాలమూరు ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. 2015లో అప్పటి సీఎం కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని. రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారని గుర్తు చేశారు. లక్ష కోట్ల ప్రాజెక్టును - మిగతా2లో



# ఎండల పై ప్రజలకు వాతావరణశాఖ అలర్ట్.. రెడ్ అలర్ట్ జారీ

తెలంగాణ పత్రిక ప్రతినిధి

ఉత్తర, మధ్య భారతం మండిపోతోంది. సాధారణం కంటే 3 నుంచి 6 డిగ్రీలు ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఢిల్లీ, రాజస్థాన్, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో వారం రోజుల పాటు తీవ్రమైన వడగాల్పులు కొనసాగనున్నట్లు భారత వాతావరణశాఖ హెచ్చరిక జారీ దేశంలో ఎండలు దంచికొడుతున్నాయి. యూపీలో రెండు రోజుల పాటు రెడ్ అలర్ట్ తదుపరి ఆరెంజ్ అలెర్ట్ జారీ అయ్యింది. ఢిల్లీలో నాలుగు రోజుల పాటు ఐఎండీ యెల్లో అలర్ట్ జారీ చేసింది. వారం రోజుల పాటు గరిష్ట ఉష్ణోగ్రతలు - మిగతా2లో



# తెలంగాణ కేబినేట్ భేటీ 23కు వాయిదా

-మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ వెలుపల మరో ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలో నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు సమాచారం. 'బాసర సరస్వతి అంత్య పుష్కరాలు' ఈ నెల 21వ తేదీన ప్రారంభం కానున్నాయి. గోదావరి నది తీరాన వెలసిన బాసర క్షేత్రంలో జరిగే ఈ అంత్య పుష్కరాలకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ చరిత్రాత్మక వేడుకకు రాష్ట్ర మంత్రివర్గంలోని మెజార్టీ మంత్రులు హాజరు కానున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం, పుష్కరాల పనులను పర్యవేక్షించడం మంత్రులకు విధిగా మారింది. మంత్రులంతా పుష్కరాల పనుల్లో, అధికారిక పర్యటనల్లో నిమగ్నమవ్వడం, బాసరకు వెళ్లనుండటంతో అదే రోజు నిర్వహించాలనుకున్న కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేయడమే ఉత్తమమని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ నెల 23వ తేదీన ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలో కేబినెట్ సమావేశాన్ని నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి యోచిస్తున్నారు. రాజధాని హైదరాబాద్‌లోని సచివాలయానికే పరిమితం కాకుండా, ప్రజలకు, పుణ్యక్షేత్రాలకు దగ్గరగా పాలనను తీసుకెళ్లాలనే ఆలోచనలో భాగంగానే ఈ వ్యూహాన్ని రచిస్తున్నారు. యాదగిరి లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న ఈ పవిత్ర క్షేత్రంలో కేబినెట్ భేటీ నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మిక, రాజకీయ సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లవచ్చని సీఎం భావిస్తున్నారు. గతంలో ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన సమ్మక్క - సారలమ్మ జాతర సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరులతో కలిసి మేడారంలో కేబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. అక్కడికక్కడే జాతర ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలు, నిధుల విడుదలపై కీలక నిర్ణయాలు తీసుకుని రికార్డు సృష్టించారు. ఇప్పుడు అదే తరహా వ్యూహాన్ని యాదగిరిగుట్ట లోనూ అమలు చేయాలని చూస్తున్నారు. దీనివల్ల స్థానిక సమస్యలపై తక్షణమే స్పందించే అవకాశం లభిస్తుందని నమ్ముతున్నారు. బాసర అంత్య పుష్కరాల కారణంగా ఈ నెల 21న జరగాల్సిన కేబినెట్ వాయిదా పడటం, దానిని ఈ నెల 23న యాదగిరిగుట్టకు మార్చాలని యోచించడం అందులో భాగమే. అయితే ఈ మార్పు పై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# ఎబోలా అరికట్టే చర్యలు బలోపేతం

-మొదటిపేజీ తరువాయి

అత్యవసర పరిస్థితిగా ప్రకటించిన నేపథ్యంలో, యుఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సిడిసి) ఈ నివారణ చర్యలను చేపట్టింది. విమానాశ్రయాలలో స్క్రీనింగ్‌తో పాటు, గత 21 రోజులలోపు ఉగాండా, డి ఆర్ సి, దక్షిణ సూడాన్‌లకు ప్రయాణించిన అమెరికా యేతర పాస్‌పోర్ట్ హోల్డర్ల పై ప్రవేశ ఆంక్షలను అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఉగాండాలోని కంపాలాలో ఉన్న అమెరికా రాయబార కార్యాలయం అన్ని వీసా సేవలను తాత్కాలికంగా నిలిపివేసి, ప్రభావితమైన దరఖాస్తుదారులకు సమాచారం అందించింది. డిఆర్‌సిలో ఉన్న ఒక అమెరికన్ సిబ్బందికి ఎబోలా వైరస్ సోకినట్లు డబ్ల్యుహెచ్ ఒ ప్రతినిధి సతీష్ పిళ్ళై ధృవీకరించారు. ఆ వ్యక్తికి పరీక్షల్లో పాజిటివ్ గా నిర్ధారణ కావడంతో,చికిత్స నిమిత్తం జర్మనీకి తరలించేందుకు యత్నిస్తున్నామని అన్నారు. అలాగే అతనితో పరిచయం ఉన్న మరో ఆరుగురిని క్వారంటైన్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రజలకు తక్షణ ప్రమాదం తక్కువగానే ఉందని అంచనా వేస్తున్నామని, అయితే మారుతున్న పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తున్నట్లు సిడిసి తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ వ్యాధి వ్యాప్తిపై ఆందోళన వ్యక్తం చేస్తూనే, ప్రస్తుతానికి ఇది ఆఫ్రికాకే పరిమితమైందని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఈ ఎబోలా సంక్షోభంపై ట్రంప్ ప్రభుత్వం స్పందిస్తున్న తీరు పై అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ ఒ) నుండి అధికారికంగా వైదొలగడం, గతంలో ఎబోలా నివారణలో కీలక పాత్ర పోషించిన 'యుఎస్ ఎఐడి' (యుఎస్ ఎఐడి) నిధులలో కోత విధించడం ప్రస్తుత నియంత్రణ ప్రయత్నాలపై ప్రతికూల ప్రభావం చూపిందనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం తీసుకుంటున్న ప్రయాణ నిషేధాలు కేవలం నాటకమేనని, ట్రంప్ ప్రభుత్వం ఈ విషయంలో చాలా వెనుకబడి వ్యవహరిస్తోందని జార్జ్‌టౌన్ యూనివర్శిటీ నిపుణులు మాథ్యూ కావనాగ్ విమర్శించారు. గతంలో ప్రభుత్వ ఏజెన్సీల సమన్వయం వల్ల వ్యాధిని వేగంగా అరికట్టగలిగారని, కానీ ఇప్పుడు వందలాది కేసులు నమోదై, తీవ్రంగా వ్యాపించిన తర్వాతే చర్యలు చేపట్టడం అమెరికా వ్యూహాత్మక వైఫల్యమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తాము స్థానిక ఆరోగ్య సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని, తక్షణ ప్రతిస్పందన చర్యల కోసం 13 మిలియన్ డాలర్ల సహాయాన్ని సమీకరించినట్లు సిడిసి ప్రకటించింది.

# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

-మొదటిపేజీ తరువాయి

అమల్లో భాగంగా రాష్ట్ర ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అన్ని ప్రభుత్వ శాఖలకు అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు వైద్య భద్రత కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. ఉద్యోగుల ఆరోగ్య సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించింది. ఫైనాన్స్ శాఖ సూచనల ప్రకారం ప్రతి ఉద్యోగి, పెన్షనర్ తమ కుటుంబ సభ్యుల వివరాలతో సహా పూర్తి డేటాను తప్పనిసరిగా సమర్పించాలి. భార్య, భర్త, పిల్లలు, ఆధారపడిన కుటుంబ సభ్యుల వివరాలు కూడా నమోదు చేయాలని స్పష్టం చేసింది. ఈ సమాచారం భవిష్యత్తులో ఆరోగ్య సేవలు, క్యాష్‌లెస్ చికిత్స వంటి ప్రయోజనాల అమలుకు ఉపయోగ పడనుంది. అన్ని శాఖల అధికారులు ఉద్యోగుల వివరాలను పోర్టల్‌లో మే 31వ తేదీలోపు అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. నిర్ణీత గడువులోపు సమాచారం నమోదు చేయని పక్షంలో భవిష్యత్తులో ఆరోగ్య పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య భద్రతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అమల్లో ఉన్న వైద్య పథకాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కొత్త విధానాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త హెల్త్ స్కీమ్‌తో ఉద్యోగులు, పెన్షనర్లు అత్యవసర వైద్య సేవలను సులభంగా పొందుతారని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాయి. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# తమిళనాడులో ఇగ కొత్త

-మొదటిపేజీ తరువాయి

తమిళనాడులో కొత్తగా కొలువుదీరిన సీఎం విజయ్ సర్కార్ అవినీతిపై ఉక్కుపాదం మోపింది. ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకత, స్వచ్ఛతను తీసుకురావడమే లక్ష్యంగా అవినీతి నిరోధక విభాగాన్ని బలోపేతం చేస్తూ ఒక సాహసోపేతమైన సరికొత్త ప్రోత్సాహక పథకాన్ని అధికారికంగా ప్రకటించింది. ఈ నూతన విధానం ప్రకారం ఏ ప్రభుత్వ శాఖలోనైనా సరే, మీ నుండి కేవలం రూ.1000 లంచం డిమాండ్ చేసినా.. ప్రజలు సాక్ష్యాధారాలతో స్వేచ్ఛగా ఫిర్యాదు చేయవచ్చు. లంచాలు అడిగే అధికారులపై సరైన ఆధారాలతో ఫిర్యాదు చేసిన పౌరులకు ప్రభుత్వం తరఫున రూ.1,00,000 నగదు బహుమతి ఇస్తామని సంచలన ప్రకటన చేసింది. ఇందుకోసం 24 గంటలూ అందుబాటులో ఉండేలా 1800 425 1555 అనే ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్‌ను కూడా ప్రవేశపెట్టింది. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని పూర్తిగా నిర్మూలించడానికి ప్రజలను భాగస్వాములను చేస్తూ తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా టీవీకే ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రచార సమయంలోనే తాము అధికారంలోకి వస్తే ఆధార్ కార్డు తరహాలో తమిళనాడు పౌరసత్వ కార్డును జారీ చేస్తామని ప్రకటించింది. ప్రతి కుటుంబం సమగ్ర సమాచారంతో కూడిన ఈ కార్డు ద్వారా, పౌరులు ఎలాంటి దరఖాస్తులు చేసుకోకుండా లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేకుండా పుట్టినప్పటి నుంచే ప్రభుత్వ పథకాల ప్రయోజనాలన్నీ నేరుగా వారి ఇంటి వద్దకే శాస్త్రీయ పద్ధతిలో అందుతాయని హామీ ఇచ్చారు. ప్రస్తుతం 108 సీట్లతో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విజయ్, అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం క్షేత్రస్థాయిలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే మంత్రి అధవ్ అర్జున తొలిసారిగా ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి, పరిపాలనా పారదర్శకతను పెంచే చర్యలపై చర్చించారు. అవినీతిపైనే కాకుండా రాష్ట్రంలో డ్రగ్స్ అక్రమ మద్యం రవాణాపై కూడా సీఎం విజయ్ యుద్ధం ప్రకటించారు. తమిళనాడులో మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలించడానికి కఠిన చర్యలు తీసుకుంటున్నామని, డ్రగ్స్ కొన్నా, అమ్మినా గూండా చట్టం ప్రయోగిస్తామని హెచ్చరించారు. "ప్రజల డబ్బులోంచి నేను ఒక్క రూపాయి కూడా ముట్టుకోను, అవినీతి రహిత పాలనను అందిస్తాను" అని సీఎం విజయ్ స్పష్టం చేశారు. రాబోయే 3 నెలల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని వంద శాతం తుడిచిపెట్టేస్తామని హామీ ఇచ్చారు.

## పీఎఫ్ ఉన్నవారికి త్వరలో కేంద్రం నుంచి శుభవార్త..

-మొదటిపేజీ తరువాయి

పీఎఫ్ అకౌంట్ ఉన్నవారికి కేంద్ర ప్రభుత్వం త్వరలో శుభవార్త అందించనుంది. త్వరలో ఈపీఎఫ్ఓ దేశంలోని లక్షలాది మంది పీఎఫ్ ఉద్యోగులకు ఉపశమనం కలిగించనుంది. అదేంటంటే.. పీఎఫ్ కనీస పెన్షన్ మొత్తాన్ని భారీగా పెంచనుంది. ప్రస్తుతం ఇది ప్రతిపాదన దశలో ఉండగా.. త్వరలో తుది నిర్ణయం వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం కనీస పెన్షన్ పరిమితి రూ.వెయ్యిగా ఉండగా.. త్వరలో రూ.3 వేలకు పెంచే అవకాశముందని తెలుస్తోంది. ప్రస్తుతం ఈపీఎస్ 95 కింద కనీస పెన్షన్ రూ. వెయ్యిగా ఉంది. దీనిని రూ.3 వేలకు పెంచాలనే డిమాండ్లు ఎప్పటినుంచో వినిపిస్తున్నాయి

**కనీస పెన్షన్ పరిమితి పెంపు..?**

ద్రవ్యోల్బణం పెరుగుతుండటం, జీవన ప్రమాణాలు మారుతుండటం వల్ల కనీస పెన్షన్ పరిమితిని పెంచాలని ఎప్పటినుంచో డిమాండ్ వినిపిస్తోంది. ఉద్యోగులు కూడా ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారు. తమ ఖర్చులకు సరిపోవడం లేదని, పెంచాలని ఆందోళనలు కూడా చేపట్టారు. దీంతో కేంద్ర ప్రభుత్వ స్పందించింది. పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు స్పష్టం చేసింది. కనీస పెన్షన్ పెంచడం వల్ల తక్కువ జీతాలు పొందుతున్నవారికి, తక్కువకాలం పాటు ఈపీఎఫ్ఓకు చెల్లింపులు చేసిన పెన్షనర్లకు ప్రయోజనం చేకూరనుంది

**పింఛన్ పొందేందుకు షరతులు**

అయితే ఈపీఎఫ్ కింద పెన్షన్ పొందేందుకు కొన్ని షరతులు ఉన్నాయి. ఆ కండీషన్స్ ఏంటంటే.. ఉద్యోగికి కనీసం 10 సంవత్సరాల సర్వీస్ రికార్డ్ ఉండాలి. అంటే 10 సంవత్సరాలుగా ఈపీఎఫ్ఓలో జమ చేస్తూ ఉండాలి. అలాగే ఎక్కువ చెల్లింపులు చేస్తున్న ఉద్యోగులకు కనీస పెన్షన్ పరిమితి పెంచడం వల్ల పరిమిత ప్రయోజనాలు ఉంటాయి. అయితే తక్కువ పించన్ పొందుతున్నవారికి మాత్రం అత్యధిక ఉపశమనం లభిస్తుంది. 20 సంవత్సరాల కంటే ఎక్కువ ఏళ్లు పీఎఫ్ కు కాంట్రిబ్యూషన్ చేసినవారికి ఎక్కువ బెనిఫిట్ ఉంటుంది. రూ. 3 వేలు పింఛనుకు సంబంధించి ప్రభుత్వం ఇంకా అధికారిక ప్రకటన జారీ చేయలేదు. కార్మిక మంత్రిత్వ శాఖ, జ్యూఖీూ ??స్థాయిలలో చర్చలు కొనసాగుతున్నాయి. త్వరలో ఒక నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. ఈ ప్రతిపాదన ఆమోదం పొందితే.. లక్షలాది మంది జ్యూూ పింఛనుదారులు, ముఖ్యంగా పింఛనుయే ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న వృద్ధులు గణనీయమైన ఉపశమనం పొందవచ్చు.

## పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

ధ్వజమెత్తారు. భూసేకరణ లేకుండానే టెండర్లు పిలిచారని విమర్శించారు. మంగళవారం సచివాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. పాలమూరుకు కేసీఆర్ హయాంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామని చెప్పుకొచ్చారు. జూరాల ప్రాజెక్టులో పూడిక తొలగించి నిల్వ సామర్థ్యం పెంచుతున్నట్లు తెలిపారు. జూరాల అభివృద్ధికి ప్రతిపాదనలు చేశామని వివరించారు. వర్షాకాలానికి ముందే చెరువుల్లో పూడికతీత పనులు చేపడతామని స్పష్టం చేశారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేస్తామని తెలిపారు. 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. 1226 గ్రామాలకు తాగునీరు అందిస్తామని తెలిపారు. 15 రోజుల్లో మరోసారి ప్రగతి సమీక్ష నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. ఆయా ప్రాజెక్టుల పురోగతిపై సమగ్ర నివేదికలు ఇవ్వాలని అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

## భారత పర్యటనకు రష్యా అధ్యక్షుడు పుతిన్..

-మొదటిపేజీ తరువాయి

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ఏడాది సెప్టెంబర్ 12, 13 తేదీల్లో భారత్ లో పర్యటించనున్నారు. భారత్ ఆతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీ రానున్నట్లు ఆ దేశ అధ్యక్ష భవనం 'క్రెమ్లిన్' మంగళవారం అధికారికంగా ధృవీకరించింది. భారత్, రష్యా మధ్య వ్యూహాత్మక, రక్షణ రంగ బంధం బలపడుతున్న తరుణంలో పుతిన్ పర్యటన ఖరారు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. గత డిసెంబర్‌లో జరిగిన 23వ భారత్-రష్యా వార్షిక సదస్సు కోసం పుతిన్ ఢిల్లీకి వచ్చారు. ఆ సమయంలో మోదీతో కలిసి ద్వైపాక్షిక సంబంధాల విస్తరణపై చర్చలు జరిపారు. ఆ పర్యటన జరిగిన ఏడాదిలోపే పుతిన్ రెండోసారి భారత్‌కు వస్తుండటం గమనార్హం.రష్యా-ఉక్రెయిన్ యుద్ధం 2022లో ప్రారంభమైన తర్వాత పుతిన్ గతేడాది డిసెంబర్‌లోనే మొదటిసారి భారత్‌లో అడుగుపెట్టారు. దానికి ముందు ఆయన 2021లో ఢిల్లీని సందర్శించారు. భారత్-రష్యా మధ్య ఏటా ఒకసారి ఇరు దేశాల అధినేతలు భేటీ అయ్యే సంప్రదాయం ఉంది. ఒక ఏడాది భారత్‌లో జరిగితే, మరో ఏడాది రష్యాలో ఈ వార్షిక సదస్సు జరుగుతుంది. భారత్ నేతృత్వంలో ఢిల్లీలో జరగబోయే ఈ ప్రతిష్ఠాత్మక బ్రిక్స్ సదస్సులో.. ప్రపంచ భద్రతా సవాళ్లు, ఆర్థిక సహకారం బలోపేతం చేయడం వంటి కీలక అంశాలపై సభ్య దేశాల అధినేతలు చర్చించనున్నారు.

## పాలమూరు ప్రాజెక్టుల పై బిఆర్ఎస్ మోసం

-మొదటిపేజీ తరువాయి

పాలమూరు ప్రాజెక్టులపై గత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. గట్టు, కల్వకుర్తి, జూరాల, కోయిల్ సాగర్, భీమా అన్ని ప్రాజెక్టుల విషయంలో పక్షపాతం చూపారని మంత్రి మండిపడ్డారు. కల్వకుర్తి పంపులు బాగు చేయలేకపోయారన్నారు. పాలమూరు ప్రాజెక్టు నీటి కేటాయింపులు సాధించలేకపోయారని తెలిపారు. కృష్ణా నీటిని పదేళ్లు ఏపీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు. రాయలసీమను రతనాల సీమ చేస్తామని చెప్పింది బీఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు. గద్వాల్‌లోని ర్యాలంపాడు రిజర్వాయర్‌ను పదేళ్లలో రిస్టోర్ చేయలేదన్నారు. పాలమూరు ప్రాజెక్టుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డితో స్వయంగా ఎమ్మెల్యేలు, మంత్రులు కలిసి చర్చించామని చెప్పారు. సీఎం కూడా పాలమూరు వాసి కాబట్టి.. ప్రాజెక్టుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టామని, పనులను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కల్వకుర్తి కింద చేపట్టనున్న గొల్లపల్లి రిజర్వాయర్‌ను చేపట్టవద్దని బీఆర్ఎస్ నేతలు ఆందోళనలు చేస్తున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు.

## ఎండల పై ప్రజలకు వాతావరణశాఖ అలర్ట్.. రెడ్ అలర్ట్ జారీ

-మొదటిపేజీ తరువాయి

వారం రోజుల పాటు గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. పాకిస్తాన్-రాజస్థాన్ సరిహద్దు నుంచి వీస్తున్న వేడి గాలులు, స్పష్టమైన ఆకాశం, ఉత్తర-పశ్చిమ దిశ నుంచి వీచే పొడి గాలులు వేడిని మరింత పెంచుతున్నాయి. ఢిల్లీ, నోయిడా, ఘాజియాబాద్, గురుగ్రామ్‌లలో మధ్యాహ్నం సమయంలో వేడి తీవ్రత అత్యధికంగా ఉంది. వాతావరణ మార్పులు (క్లైమేట్ చేంజ్) మరియు ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. రోహతక్ (హర్యానా): 46.9 డిగ్రీలు, ఝాన్సీ (పశ్చిమ ఉత్తరప్రదేశ్): 46.5 డిగ్రీలు, చితోర్ఘడ్ (తూర్పు రాజస్థాన్): 46.3 డిగ్రీలు, శ్రీగంగానగర్ (పశ్చిమ రాజస్థాన్): 45.9 డిగ్రీలు, పాటియాలా (పంజాబ్): 45.3 డిగ్రీలు, అహ్మదాబాద్ (గుజరాత్): 43.7 డిగ్రీలు, నిజామాబాద్ (తెలంగాణ): 44 డిగ్రీలు, అప్రమత్తమైన ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తీవ్రమైన వేడిగాలులు ఎండల ప్రభావంతో ఉత్తరప్రదేశ్‌లో రెండు రోజుల పాటు రెడ్ అలర్ట్, తర్వాత ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో మరో రెండు రోజులు భయంకరమైన వడగాల్పులు కొనసాగనున్నాయి. డిప్యూటీ సీఎం బ్రిజేష్ పాఠక్ ఆదేశాల మేరకు అన్ని జిల్లా ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో అదనపు బెడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వడదెబ్బ బాధితులకు తక్షణ చికిత్స అందించడానికి వైద్యులు సిద్ధంగా ఉండాలని ఆరోగ్య శాఖ ఆదేశించింది.

**ప్రజలకు జాగ్రత్త చర్యలు సూచించిన వాతావరణ శాఖ**

వేడి ఎండ తీవ్రత పరిస్థితుల దృష్ట్యా ప్రజలు జాగ్రత్తగా ఉండాలి..పిల్లలు, వృద్ధులు, బయట పని చేసే వ్యక్తులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల వరకు ఎక్కువగా బయటకు రాకపోవడం మంచిది.తగినంత నీరు తాగడం, తేలికపాటి దుస్తులు ధరించడం, తలకు కుడితో కప్పుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది.రానున్న రోజుల్లో ఎండ వేడి మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు.

# టియుడబ్ల్యూ ఐజెయు ఈసీ మెంబర్ గా ఎన్నికైన హబీబ్

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది మే 19:

ములుగు జిల్లా టియుడబ్ల్యూ జే – ఐజేయు ద్వితీయ మహాసభలు ములుగు జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క పాల్గొని జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని జర్నలిస్టు నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్నారని వారి కృషిని కొనియాడారు. టిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమారి లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని పార్టీలకతీతంగా ప్రజల పక్షాన ఉంటూ నిరంతరం ప్రజల గొంతుకగా మాట్లాడుతున్న జర్నలిస్టులు పాత్ర ఎంతో కీలకమని అన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎండి షఫీ అహ్మద్ అధ్యక్షతన జరిగిన ద్వితీయ జాతీయ మహాసభలలో ఐజేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ, రాష్ట్ర, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు కంకణాల సంతోష్, కొండం రవీందర్ రెడ్డి ఉపాధ్యక్షుడు గాడిపల్లి మధు ముఖ్య అతిథులుగా హాజరై పాల్గొన్నారు. ములుగు జిల్లా టియుడబ్ల్యూజే – ఐజేయు జిల్లా కమిటీని రెండేళ్ల కాల పరిమితి కోసం ఎన్నికలు నిర్వహించి ఎన్నుకోవడం జరిగింది. తిరిగి రెండవ సారీ జిల్లా అధ్యక్షుడిగా ఎండి షఫీ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా చిదురాల వాసుదేవ్, ఈసీ మెంబర్ గా చైర్మన్ ఎండీ హబీబ్ ఖాన్ లను ఎన్నుకోవడం జరిగింది.



# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలిలో భాగంగా యువజన క్రీడా వారోత్సవాల కింద నైపుణ్యాభివృద్ధిపై ఐడీఓసీలో అవగాహన సదస్సు







-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 19, తెలంగాణ పత్రిక

నైపుణ్యాభివృద్ధితో ఎన్నో అవకాశాలు వస్తాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాల సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం నైపుణ్యాభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జయ జయహే తెలంగాణ పాటను వినిపించారు. ఈ సందర్భంగా వివిధ శిక్షణ సంస్థలు ఐటీఐ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, ఆర్ సేటీ, జీఎంఆర్, ఐడీటీఆర్, టాస్క్, ఇతర సంస్థల ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి.. ఏ ఏ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు అర్హత ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో నేటి యువత, విద్యార్థులు చాలా కీలకమని స్పష్టం చేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇటీవల విద్యా శాఖ వారోత్సవాల కింద సమ్మర్ క్యాంపులు నిర్వహించామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఎన్నో అంశాల్లో ప్రతిభ చూపారని గుర్తు చేశారు. విద్యతోపాటు ఆటలు ఆడాలని, దీంతో శారీరక, మానసిక సమతుల్యత ఉంటుందని, క్రమ శిక్షణ అలవడుతుందని వివరించారు. ఉన్నత చదువుతోపాటు టెక్నికల్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. ఇప్పటి పరిశ్రమలకు ఎలాంటి స్కిల్స్ అవసరమో తెలుసుకొని ఆ దిశలో ముందుకు వెళ్లాలని పిలుపు నిచ్చారు. ఐటీఐ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, ఆర్ సేటీ, జీఎంఆర్, ఐడీటీఆర్, టాస్క్ తదితర సంస్థల్లో అందిస్తున్న ఉచిత శిక్షణ కోర్సులను సద్విని యోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. పూర్తి వివరాలకు ఆయా సంస్థల్లో సంప్రదించాలని సూచించారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లో శిక్షణ పొందిన వారికి పలు సంస్థలు ఉపాధి కల్పిస్తాయని తెలిపారు. పరిశ్రమల శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల ఆద్వర్యంలో అందిస్తున్న స్వయం ఉపాధి స్కీములు, సబ్సిడీ సద్వినియోగం చేసుకొని.. స్వయం యువత ఉపాధి పొందాలని ఆకాంక్షించారు. జిల్లాలోని వివిధ శిక్షణ సంస్థలు ఏడాది అంతాయువతకు శిక్షణ అందించేలా ప్రణాళిక రూపొందించి ముందుకు వెళ్లాలని సూచించారు. నర్సింగ్ పూర్తి చేసి.. విదేశాల భాష, నైపుణ్యాల్లో పట్టు ఉన్న వారికి టామ్ కామ్ ఆద్వర్యంలో వివిధ దేశాల్లో ఉపాధి కల్పన అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. జిల్లా నుంచి ఇప్పటిదాకా 45 మందికి విదేశాల్లో కొలువులు వచ్చాయని తెలిపారు. నర్సింగ్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. యువత ఉపాధిని పొంది తమ తల్లితండ్రుల సంరక్షణ బాధ్యతను చూసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, జీఎం ఇండస్ట్రీస్ హనుమంతు, డీవైఎస్ఓ రాందాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, ఎల్డీఎం మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం తరలింపు.. అన్ లోడింగ్ లో మరింత వేగం పెంచాలి

-ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాలను సరిపడా సమకూర్చాలి
-ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేయాలి
-కొనుగోలు కేంద్రాలు, గోదాముల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పెట్టాలి
-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 19, తెలంగాణ పత్రిక

కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపు.. రైస్ మిల్లులు, గోదాముల్లో అన్ లోడింగ్ లో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం తరలింపు, అన్ లోడింగ్, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ, రైతులు, హమాలీలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై మంగళవారం ఉదయం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పౌర సరఫరాల, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా ఇతర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తూకం వేయడం, తూకం వేసిన ధాన్యాన్ని నిర్దేశించిన మిల్లులు, గోదాములకు తరలించడంపై అధికారులు దృష్టి సారించి, క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు సరిపడా వాహనాలను ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు సమాకూర్చాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం లోడింగ్ కోసం, మిల్లులు, అపరల్ పార్క్ లో ధాన్యం అన్ లోడింగ్ చేయడం కోసం హమాలీల సంఖ్యను మరింత పెంచాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో రైతులు, హమాలీలు అలాగే అన్ లోడింగ్ చేసే మిల్లులు, గోదాముల్లో హమాలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని, తాగు నీరు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పెట్టాలని సూచించారు. ఇంకా జిల్లాలో ఉన్న గోదాములను ధాన్యం అన్ లోడింగ్ చేసేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించిన ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ జాప్యం చేయవద్దని డీఆర్డీఓ, డీసీఓ, ఏవో మెప్మా, ఇతర అధికారులను ఆదేశించారు. ఆయా మండలాలకు చెందిన సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత శాఖల అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు తప్పనిసరిగా తనిఖీలు చేస్తూ సూచనలు చేయాలని సూచించారు.



# ఎల్లారెడ్డిపేట వడ్ల కొనుగోలు కేంద్రం పరిశీలించిన సింగిల్ విండో అధ్యక్షుడు, డైరెక్టం

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 19, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వడ్ల కొనుగోలు సెంటర్‌ను సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, డైరెక్టర్ నేవూరి వెంకట నరసింహారెడ్డి పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో రైతులు తీసుకొచ్చిన ధాన్యం నిల్వలను పరిశీలించి, వెంటనే ధాన్యాన్ని మిల్లుకు తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.



# సన్ షైన్ విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే

చండూర్ తెలంగాణ పత్రిక మే 19





తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో మండల 2వ, 3వ మరియు 5వ ర్యాంకులు సాధించిన మున్సిపాలిటీ కేంద్రంలోని సన్ షైన్ హై స్కూల్ విద్యార్థులను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, హైదరాబాదులోని వారి కార్యాలయానికి ఆహ్వానించి మండల 2వ ర్యాంకు సాధించిన చెరుపల్లి శృతి, మండల 3వ ర్యాంకు సాధించిన చెదురువెల్లి హాసిని,మండల 5వ ర్యాంక్ సాధించిన రావిరాల వైష్ణవి లను శాలువాలు కప్పి మెమెంటోలను అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, మాట్లాడుతూ విద్యార్థులు చదువులో అత్యున్నత స్థానాలను పొందాలని తద్వారా జన్మనిచ్చిన తల్లిదండ్రులకు విద్యాబుద్ధులు నేర్పించిన పాఠశాలకు మరియు పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని చదువులో ఇదేవిధంగా ముందుకు సాగుతూ మునుగోడు నియోజకవర్గానికి ప్రత్యేక స్థానాన్నీ కల్పించాలని ఆశించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న, మాట్లాడుతూ మా సన్ షైన్ పాఠశాల విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందుంటారని తద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఆశించారు.

# అనంతపల్లి అభివృద్ధి పనులు, వడ్ల కొనుగోలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 19, తెలంగాణ పత్రిక

అనంతపల్లి గ్రామ సర్పంచ్ గంగాధర కావ్య లక్ష్మణ్ మర్యాదపూర్వకంగా కలిసి గ్రామంలోని పలు అభివృద్ధి పనులు మరియు వడ్ల కొనుగోలు కేంద్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అనంతపల్లి గ్రామంలో తక్షణం చేపట్టాల్సిన రహదారులు, తాగునీటి సౌకర్యాలు, డ్రైనేజీ వ్యవస్థ వంటి అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేకు వివరించారు. అలాగే గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో రైతులు వడ్లు అమ్మకానికి తీసుకువస్తున్న సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులు, సరైన సౌకర్యాల లేమి, రవాణా సమస్యలు, కూలీలకు చెల్లింపుల అంశాలను కూడా ప్రస్తావించారు. సర్పంచ్ గంగాధర కావ్య లక్ష్మణ్ వినతిని ఆలకించిన ఎమ్మెల్యే సత్యం సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో గ్రామానికి సంబంధించిన పలు ప్రజా సమస్యలపై చర్చించి, త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలని కోరినట్లు సమాచారం.

# ఇసుక లారీలతో ధ్వంసమైన రోడ్డును మరమ్మత్తులు చేపట్టిన మాజీ సర్పంచ్ పోతుల నర్సయ్య

-ప్రశంసిస్తున్న గ్రామస్తులు, వాహనదారులు...

వీణవంక ప్రతినిధి,మే 19( తెలంగాణ పత్రిక)



అధిక బరువు తో నిత్యం వందలాది ఇసుక లారీలు రెడ్డిపల్లి బస్టాండ్ కూడలి మీదుగా రాక పోకలు సాగించడం మూలంగా బస్టాండ్ కూడలి రోడ్లు మొత్తం భారీ గుంతలు ఏర్పడి కనీసం సైకిల్ కూడా వెళ్ళలేని విదంగా అత్యంత ప్రమాద కరంగా మారాయి. పరిస్థితిని గమనించిన రెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పోతుల నర్సయ్య ప్రస్తుతం నేను పదవిలో లేను కదా అని సమస్యను అలాగే వదిలివేయకుండ తన సొంత ఖర్చుతో రోడ్డు మరమ్మత్తుకు కావల్సినవాహనాలను,మట్టి,కంకర సమకూర్చుకొని తనే స్వయంగా దగ్గరఉండి సూచనలు ఇస్తూ రోడ్డు పునర్నిర్మించారు. మాజీ సర్పంచ్ పోతుల నర్సయ్య పదవిలో వున్నప్పుడు లేనప్పుడు ఒకేలాగా గ్రామ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటాడని, కొనియాడుతూ, మాజీ సర్పంచ్ నర్సయ్య పై గ్రామ ప్రజలు, వాహనదారులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా నిజం


## వరి లో క్రొత్త వంగడాలను వాడండి.. అధిక లాభాలను పొందండి

**-జగిత్యాల ఏ ఆర్ ఎస్ శాస్త్రవేత్త మధుకర్..**




వీణవంక ప్రతినిధి, మే 19( తెలంగాణ పత్రిక).

వీణవంక మండల కేంద్రంలోని రైతు వేదిక లో మంగళవారం "రైతు ముంగిట్లో శాస్రవేత్తలు "కార్యక్రమంలో భాగంగా వీణవంక క్లస్టర్ పరిధి లోని గ్రామాలకు చెందిన రైతులకు వ్యవసాయ రంగం లో అవగాహనా కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి శాస్త్రవేత్త మధుకర్ మాట్లాడుతూ.. వరి పంటలో రకాలు, ఎరువుల వాడకం, పంటల యజమాన్యం, పంటలలో రోగాలు, చీడపీడల నివారణ విధానం రైతులకు సువివరంగా వివరించారు.ఈ కార్యక్రమం లో ఏ ఆర్ ఎస్ జగిత్యాల శాస్రవేత్త మధుకర్, మండల వ్యవసాయ అధికారి గణేష్, ఏఈఓ గౌతమి,వీణవంక అన్నా హజారే టీం రైతు సమన్వయ కమిటీ సభ్యులు, వీణవంక రైతు సోదరులు, నర్సింగాపూర్, రామకృష్ణాపూర్, లాస్మక్కపల్లి, బ్రాహ్మణపల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన రైతులు, ఫర్టిలైజర్స్ షాప్ డీలర్స్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ దాట్ల వీరాస్వామి




వీణవంక ప్రతినిధి, మే 19(తెలంగాణ పత్రిక )

వీణవంక మండలం కొండపాక గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తేది 18.5.2026 నుండి 1.6.2026 వరకు ఉచిత వేసవి శిక్షణా శిబిరాన్ని గ్రామ సర్పంచ్ దాట్ల వీరస్వామి చేతుల మీదుగా ప్రారంభం కాబడింది.మొదటి రోజు 12 మంది విద్యార్థులు హాజరు అయ్యారు.రెండవ రోజు 15 మంది విద్యార్థులు హాజరు అయ్యారు.ఈ కార్యక్రమంలో బోధించే అంశాలు.1. స్పోకెన్ ఇంగ్లీషు,2. గణితం,3. యోగా,4. ఆటలు,5. నీతి కథలు లాంటి అంశాలను ఉపాధ్యాయుడు ముదిగంటి రాజేందర్ రెడ్డి విద్యార్థులకు బోధిస్తున్నారు.

## నేటి నుండి రాయికల్ రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు మరియు ఎల్లమ్మ తల్లి పట్నాలు

రాయికల్, మే 19( తెలంగాణ పత్రిక):





రాయికల్ పట్టణంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు,పట్నాలు నిర్వహిస్తున్నట్లు గౌడ సంఘం అధ్యక్షులు ఎనుగందుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తేది:20-05-2026 బుధవారము రోజున రేణుక ఎల్లమ్మ తల్లికీ గంగస్నాన్నపూజ ,21 నుండి 23 వరకు జోగు కార్యక్రమము,24 ఆదివారము రోజున సాయంత్రం 5 నుండి పోచమ్మ బోనాలు,25 సోమవారము రోజున పుట్ట బంగారం, "మహా అన్న ప్రసాదం", లంద పూజ, రాత్రి ఎల్లమ్మ బోనాలు, 26 మంగళవారము రోజున శ్రీ రేణుక ఎల్లమ్మ పట్నాలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి బండి ప్రవీణ్, ఉపాధ్యక్షుడు పొన్నం శ్రీకాంత్, కమిటీ సభ్యులు , గౌడ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ లో దరఖాస్తులకు ఆహ్వానం

నంగునూరు, మే 19, (తెలంగాణ పత్రిక):



నంగునూరు మండల పరిధిలోనీ నర్మెట్ట కేజీబీవీ లో 6 వ తరగతి నుండి 8 వ తరగతి మరియు ఇంటర్ ప్రథమ సంవత్సరం బిపిసి గ్రూపు లో సీట్ల కోసం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి కడతల పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంగ్లంలో బోధన ఉంటుంది, నీరుపేద బాలికలకు మంచి అవకాశమని అన్నారు. మౌలిక వసతులతో కూడిన వసతి గృహం విద్యార్థినీలకు అన్నిరకాల వసతులు, మెనూ ప్రకారం పౌష్టికాహారంతో కూడినబోజనం , నైపుణ్యం కలిగిన ఉపాధ్యనీలచే విద్యా బోధన చేయడం జరుగుతుందని అన్నారు. కావున పరిసర ప్రాంతాల వారు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# జగిత్యాల ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఎంపీ అరవింద్ వ్యాఖ్యలు

**-ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్.**

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) మే 19




జగిత్యాల మోతే రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ఎంపీ ధర్మపురి అరవింద్ చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఎంపీ వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన సమాఖ్య స్ఫూర్తి ప్రకారం రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన నిధులను కేంద్రాన్ని అడగడం ముఖ్యమంత్రి బాధ్యతేనని, అలాంటి సందర్భంలో ముఖ్యమంత్రిని అవమానించేలా మాట్లాడటం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్రం గత ఐదేళ్లలో జీఎస్టీ రూపంలో కేంద్రానికి రూ.2 లక్షల కోట్లకు పైగా ఆదాయం అందిస్తే, కేంద్రం తిరిగి కేవలం రూ.85 వేల కోట్ల నిధులే రాష్ట్రానికి ఇచ్చిందని పేర్కొన్నారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటులో ఎమ్మెల్యేతో పాటు స్థానిక ఎంపీకి కూడా సమాన బాధ్యత ఉంటుందని స్పష్టం చేశారు. స్థల కేటాయింపు విషయంలో తాను పలుమార్లు సాగునీటి శాఖ మంత్రిని కలిసి ఐదు ఎకరాల భూమి కేటాయించాలని వినతిపత్రాలు అందజేశానని తెలిపారు. కేంద్రీయ విద్యాలయం స్థల సేకరణలో ఎమ్మెల్యే అసమర్థత ఉందని ఆరోపించే వారు, నియోజక వర్గానికి అవసరమైన జాతీయ రహదారులు, బ్లాక్‌స్పాట్ రోడ్లు, వంతెనలు, జగన్నాథ్‌పూర్ బ్రిడ్జి వంటి కీలక అభివృద్ధి పనులకు నిధులు తీసుకురావడంలో ఎంపీ ఎందుకు విఫలమయ్యారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. ఈ అంశాలపై తాను పలుమార్లు ఎంపీతో పాటు కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేసినా ఇప్పటి వరకు స్పష్టమైన సమాధానం లేదని విమర్శించారు. చల్గల్‌లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు తాము పూర్తి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని, స్థలం సాకుగా చూపుతూ విద్యాలయాన్ని ఇతర ప్రాంతాలకు తరలించే ఆలోచన చేయవద్దని హెచ్చరించారు. వాలంటరీ సంస్థ స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ అని, దాని అభివృద్ధి గురించి ఎప్పుడైనా ఆలోచించారా అని ప్రశ్నించారు. టీఆర్ నగర్ టీచర్స్ కాలనీ సమీపంలో జాతీయ రహదారికి కేవలం 200 మీటర్ల దూరంలో ఆరు ఎకరాల భూమి సిద్ధంగా ఉందని తెలిపారు. జగిత్యాల నియోజకవర్గ పరిస్థితులపై కనీస అవగాహన లేకుండానే అహంకార పూరితంగా మాట్లాడటం బాధాకరమన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం మానుకోవాలని సూచించారు.తాను నియోజక వర్గంలోని అన్ని దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించానని, కులమత రాజకీయాలు చేయడం తనకు అలవాటు లేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో వడ్లు, మక్కల కొనుగోలు ప్రధాన సమస్యగా మారిందని, ఎఫ్‌సీఐ ధాన్యం సేకరణలో జరుగుతున్న జాప్యమే రైతుల ఇబ్బందులకు కారణమని తెలిపారు. టీడీపీ-బీజేపీ మద్దతు ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో కూడా కేంద్రం మక్కజొన్న కొనుగోలు చేయడం లేదని గుర్తు చేశారు. గత ఆరు నెలల్లో ఎఫ్‌సీఐ ద్వారా ఎంత ధాన్యం సేకరించారో కేంద్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేవలం మద్దతు ధర పెంచి చేతులు దులుపుకోవడం రైతులకు ప్రయోజనం చేకూర్చదన్నారు.మామిడి మార్కెట్ ఏర్పాటుకు వాలంటరీ భూమిలో 10 ఎకరాలు కేటాయించే అంశాన్ని మతపరంగా చూడటం సరికాదన్నారు. మామిడి పంట సాగు చేసే రైతుల్లో 90 శాతం మంది హిందువులేనని, హిందూ వ్యాపారులు లేరా అని ప్రశ్నించారు. అభివృద్ధి కార్యక్రమాలను మత రాజకీయాలతో ముడిపెట్టడం తగదన్నారు.ఎంపీ అరవింద్ నిజంగా జగిత్యాల అభివృద్ధిపై దృష్టి పెడితే జాతీయ రహదారులు, వంతెనలు, జగన్నాథ్‌పూర్ బ్రిడ్జి, బ్లాక్‌స్పాట్ రోడ్ల పనులకు కేంద్ర నిధులు తీసుకురావడంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు.నాయకుల ప్రవర్తన, వారు చేసిన అభివృద్ధి పనులను ప్రజలు గమనిస్తూనే ఉంటారని, చివరికి తీర్పు చెప్పేది ప్రజలేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఒక నాయకుడు మరొకరిని లక్ష్యంగా చేసుకుని విమర్శించడం వల్ల ప్రజాభిప్రాయం మారదని, ప్రజలే నిజానిజాలు అంచనా వేసి నిర్ణయం తీసుకుంటారని అన్నారు.ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు ఘాజంగి నందయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ సమయంలో వాణి శ్రీనివాస్, డీసీసీ కార్యదర్శి బండ శంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్లు ఏ. నాగభూషణం, గోలి శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్ కొలుగోరి దామోదర్ రావు, నక్కల రవీందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్, సీనియర్ నాయకులు గట్టు సతీష్, ముజీబ్ బాషా, అడువల లక్ష్మణ్, బాలముకుందం, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీరం రాజేష్, మహిళా కౌన్సిలర్లు పంబాల సుజాత రాము, ఏనుగుల లావణ్య రాజు, మమత రామకృష్ణారెడ్డి, గంగజల రాజ్‌కుమార్, బదుగు పద్మ, కోరే జయ గంగమల్లు, బొల్లరపు స్వప్న గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తున్నాం- ప్రభుత్వ విప్





(తెలంగాణ పత్రిక) మే 19 ఓదెల

ఓదెల మండలంలోని కొలనూర్, ఓదెల, పొత్కపల్లి, జీలకుంట గ్రామాల్లో మార్క్ ఫెడ్ మరియు ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్లు మరియు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను మంగళవారం సందర్శించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అనంతరం పొత్కపల్లి వద్ద మక్కల గోదామును పరిశీలించారు.

**-ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ**

వడ్లు, మక్కల కొనుగోళ్ల విషయంలో రైతులెవరూ అధైర్యపడొద్దని, ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తున్నామని ఆయన హామీ ఇచ్చారు. పెద్దపల్లి నియోజకవర్గమంతటా కొనుగోళ్లు, దిగుమతులు మరియు రైస్ మిల్లులకు సరఫరా పారదర్శకంగా సాగుతున్నాయని చెప్పారు. పంటకు మద్దతు ధర దిగుబడి, మక్కలకు ప్రభుత్వం క్వింటాలుకు కనీస మద్దతు ధర నిర్ణయించిందని, ఈసారి ఎకరానికి మక్కలు 40 క్వింటాళ్లు, వడ్లు 30 నుండి 40 క్వింటాళ్ల వరకు బంపర్ దిగుబడి వచ్చిందని తెలిపారు. మరో 10-12 రోజుల్లో వర్షాలు/తుఫానులు వచ్చే అవకాశం ఉన్నందున రాబోయే రోజులు చాలా కీలకమైనవని చెప్పారు. మక్కల కొనుగోళ్లకు ఈ నెల 27వ తారీఖే కటాఫ్ డేట్ అని, రైతులు ఆలస్యం చేయకూడదని హెచ్చరించారు. ఇంకా 8-9 రోజులే సమయం ఉన్నందున రైతులు త్వరపడాలన్నారు. అలాగే పొత్కపల్లి వద్ద మక్కల గోదాముతో పాటు, అదనంగా శ్రీరాంపూర్‌లో కూడా 2500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదామును ఏర్పాటు చేశామన్నారు. రేపటి నుండి శ్రీరాంపూర్ మక్కలను అక్కడే ఉంచుతారని, దీనివల్ల రైతులకు రవాణా ఖర్చులు, దూరం తగ్గుతాయని వివరించారు. రైతుల సొంత ఏర్పాట్లు & గన్నీ సంచుల రీయింబర్స్‌మెంట్ ప్రస్తుతం ఎండ తీవ్రత వల్ల కొంత హామాలి (కూలీల) సమస్య ఉన్నందున, రైతులు హమాలీల కోసం చూడకుండా ఒకరికొకరుసహకరించుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే సంచుల కోసం ఎదురుచూడకుండా రైతులు సొంతంగా గన్నీ సంచులు కొనుక్కున్నా ఒక్కో సంచికి రూ. 21 చొప్పున ప్రభుత్వమే తిరిగి అకౌంట్లలో జమ చేస్తుందని స్పష్టం చేశారు. రైతులు సమన్వయంతో ఉండి పంటను త్వరగా అమ్ముకోవాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోత్కపల్లి సింగిల్ విండో చైర్మన్, మండల పార్టీ అధ్యక్షులు మరియు పలు గ్రామాల సర్పంచ్లు, ఉపసర్పంచ్లు మరియు వార్డు సభ్యులు మరియు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల కాంగ్రెస్ ఫైర్ బ్రాండ్ ఎక్కడ..?

జగిత్యాల ప్రతినిధి, మే 19, (తెలంగాణ పత్రిక)



జగిత్యాల కాంగ్రెస్‌లో ప్రత్యేక పరిచయం అక్కర్లేని "ఫైర్ బ్రాండ్" నాయకుడిగా గుర్తింపు పొందిన కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ముఖేష్ కన్నా గత పది రోజులుగా రాజకీయంగా సైలెంట్‌గా ఉండటం కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. జగిత్యాలలో రాజకీయ వేడి పెరుగుతున్న సమయంలో ఆయన కనిపించకపోవడం, స్పందించకపోవడం కార్యకర్తలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరిన తర్వాత కాంగ్రెస్ పార్టీపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన సమయంలో ఎక్కువ మంది కాంగ్రెస్ నాయకులు మౌనం పాటించారు. అయితే ఆ సమయంలో ముఖేష్ కన్నా ముందుకు వచ్చి ప్రెస్ మీట్ నిర్వహించి జీవన్ రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ పరువును కాపాడారని కార్యకర్తలు గుర్తు చేస్తున్నారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల అంశంపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని రైతులను రెచ్చగొట్టే విధంగా మాట్లాడినప్పుడు కూడా ముఖేష్ కన్నా స్పందించి రైతులకు వాస్తవాలు వివరించే ప్రయత్నం చేశారని కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నాయి. అలాంటి నాయకుడు ఇప్పుడు ఎంపీ అరవింద్ సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసినా స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కాంగ్రెస్‌లోని కొందరు సీనియర్ నాయకులు గ్రూప్ రాజకీయాలతో ముఖేష్ కన్నాను కావాలనే పక్కన పెట్టారని, దాంతోనే ఆయన మనస్థాపానికి గురై దూరంగా ఉంటున్నారనే చర్చ జరుగుతోంది. గతంలో జీవన్ రెడ్డి వద్ద సీనియర్లమంటూ యువ నాయకత్వాన్ని దూరం చేసిన వారే ఇప్పుడు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వద్ద కూడా తమ మాటే చెల్లాలని ఒత్తిడి తీసుకొస్తున్నారనే ఆరోపణలు పార్టీ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే స్థానిక నాయకత్వం కూడా ఈ వ్యవహారం పై పెద్దగా స్పందించడం లేదని కార్యకర్తలు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. ఏది ఏమైనా కాంగ్రెస్ పార్టీకి ఫైర్ బ్రాండ్‌గా గుర్తింపు పొందిన ముఖేష్ కన్నా సైలెంట్‌గా ఉండటం పార్టీకి నష్టమేనని కార్యకర్తలు గుసగుసలాడుతున్నారు.

# పకడ్బందీగా జనగణన సర్వే నిర్వహించాలి




**-ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి**
**-జిల్లా కలెక్టర్ అంకిత్.**

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 19

అశ్వాపురం మండలంలో మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్ పలు కార్యక్రమాలను ఆకస్మికంగా పరిశీలించారు. మల్లెలమడుగు గ్రామంలో నిర్వహిస్తున్న సెన్సస్--2027 జనగణన ఇంటింటి సర్వే ప్రక్రియను పరిశీలించిన అనంతరం మొండికుంట ధాన్యం కొనుగోలు కేంద్రం, సీతారాం పురంలోని శివసాయి రైస్ మిల్‌ను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రాచలం సబ్ కలెక్టర్ మృణల్ శ్రేష్ఠ కూడా కలెక్టర్ వెంట పాల్గొన్నారు. మల్లెలమడుగు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లతో కలెక్టర్ మాట్లాడి, వివరాల నమోదు విధానం, డేటా సేకరణ ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం దేశంలో జరుగుతున్న 16వ జనగణన ఇదేనని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న తొలి జనగణన కావడం విశేషమన్నారు. ఈసారి తొలిసారిగా పూర్తిస్థాయిలో డిజిటల్ విధానంలో సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. జనగణనలో మొత్తం 34 ప్రశ్నలు ఉంటాయని, ఒక్కో కుటుంబానికి సంబంధించిన వివరాలను సుమారు ఐదు నిమిషాల్లోనే నమోదు చేయవచ్చని కలెక్టర్ వివరించారు. ఎన్యూమరేటర్ల ఐడీ కార్డులపై ఉన్న క్యూ ఆర్ ( క్యూఆర్) కోడ్‌ను స్కాన్ చేస్తే వారి పూర్తి వివరాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రజలు అధికారిక సిబ్బందికి సహకరించి ఖచ్చితమైన సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమాచార సేకరణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని, ప్రతి ఇంటిని కవర్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మొండికుంట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలోని ధాన్యం నిల్వలు, కొనుగోలు ప్రక్రియ, రవాణా ఏర్పాట్లు, రైతులకు అందుతున్న సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిన్నటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు, ప్రస్తుతం ఉన్న నిల్వలు, రైతుల నుంచి ధాన్యం రాక పరిస్థితి, ఎదురవుతున్న సమస్యలపై సమగ్రంగా సమీక్షించారు. ప్రస్తుతం కేంద్రంలో 5,550 ధాన్యం బ్యాగులు నిల్వలో ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కొనుగోలు కేంద్రానికి మ్యాపింగ్ చేసిన రైస్ మిల్లుల వివరాలు, ధాన్యం తరలింపు ప్రక్రియ, లోడింగ్--అన్‌లోడింగ్ పరిస్థితులు, లారీల లభ్యత తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. రైతులు ధాన్యం తీసుకొచ్చిన వెంటనే తూకం, రికార్డు నమోదు, నిల్వ, రవాణా వంటి ప్రక్రియలు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడా ధాన్యం పేరుకుపోకుండా మిల్లులకు సకాలంలో తరలించేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ధాన్యం నాణ్యతను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ తేమ శాతం, శు భ్రత, నిల్వ విధానం వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. రైతులు తీసుకొచ్చే ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాల మేరకు పారదర్శకంగా కొనుగోలు చేయాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్న హమాలీలతో కలెక్టర్ మాట్లాడారు. బీహార్ రాష్ట్రం నుంచి వచ్చిన హమాలీల పని పరిస్థితులు, వసతి, తాగునీరు, ఆహారం తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. వారికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ అంకిత్ ఆవిష్కరించారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల నిర్వహణ, దిగుబడి పెంపు, సాంకేతిక సూచనలు గ్రామస్థాయిలో అందించేలా కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ ఆధునిక సాగు విధానాలను అవలంబించాలని కలెక్టర్



అన్నారు. అనంతరం అశ్వాపురం మండలంలోని సీతారాంపురం గ్రామంలో ఉన్న శివసాయి రైస్ మిల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులో ధాన్యం నిల్వలు, మిల్లింగ్ సామర్థ్యం, స్టాక్ వివరాలు, మిల్లింగ్ ప్రక్రియపై మిల్ యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రైస్ మిల్లులో సుమారు 6,000 క్వింటాళ్ల ధాన్యం నిల్వలో ఉన్నట్లు మిల్ సిబ్బంది వివరించింది. మిల్లులో ధాన్యం నిల్వ విధానం, భద్రతా చర్యలు, రికార్డు నిర్వహణ, తరలింపు ప్రక్రియలను పరిశీలించిన కలెక్టర్ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మిల్లింగ్ ప్రక్రియ పారదర్శ కంగా నిర్వహించాలని సూచించారు. రైతులు అమ్మిన ధాన్యం వేగంగా మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని, నిల్వలు పేరుకుపోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. రైతులు కేంద్రాలకు తీసుకొచ్చే ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా కొనుగోలు చేసి, సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా వేగవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో సర్పంచ్ మర్రి సంధ్యారెడ్డి, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు, తాసిల్దార్ సూర్యప్రకాష్, వ్యవసాయ శాఖ ఏడి తాతారావు, ఏఎస్ఓ రాజ్యలక్ష్మి, ఆర్ఐ లీలావతి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణ భారత కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాత సుందరయ్య కు ఘన నివాళి

**-రేపాకుల శ్రీనివాస్ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు.**



చర్ల ప్రతినిది. మే 19.(తెలంగాణ పత్రిక):

చర్ల దక్షిణ భారతదేశంలో శ్రామిక వర్గ రాజ్య స్థాపన కోసం జీవితాంతం కృషిచేసిన ఆదర్శనేత అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాస్ తెలిపారు, మంగళవారం నాడు సిపిఎం కార్యాలయంలో ఆదర్శ నేత అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు , ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు,మండల కార్యదర్శి మచ్చ రామారావు సిపిఎం జెండా ఆవిష్కరించారు, అనంతరం సిపిఎం మండల కమిటీ సభ్యులు బందెల చంటి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య భారతదేశంలో దోపిడీ లేని సమాజం కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్ప నాయకుడని మండల కార్యదర్శి రామారావు అన్నారు, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా దేశంలో పేదరికం పెరుగు తుండటంతో పేదలందరినీ ఐక్యం చేయడం కోసం 1936 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం స్థాపించారున్నారు, ఆదర్శ నేతగా, నిరాడంబర ప్రజా ప్రతినిధిగా సుందరయ్య ఈ దేశానికి సేవలు అందించారని తెలిపారు, సమసమాజ స్థాపన కోసం సిపిఎం పార్టీ ఆద్వర్యంలో అనేక పోరాటాలు చేశారని, తెలంగాణ ప్రాంతంలో నిజాం ప్రభుత్వం పై సాయుధ పోరాటం చేసి పది వేల ఎకరాల భూమిని పేదలకు పంచారని అన్నారు, దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్ట్ ఉద్యమం నిర్మించిన గొప్ప నేత అన్నారు, ఆయన స్ఫూర్తితో నేటి తరం మతతత్వ, కార్పోరేట్ శక్తుల నుండి దేశాన్ని కాపాడేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు పొడుపుగంటి సమ్మక్క,బందెల చంటి, దొడ్డి హరినాగవర్మ, ఉడుగుల షారోని, వరదల వరలక్ష్మి, తెలంగాణ రైతు సంఘం చర్ల మండల అధ్యక్షులు శ్యామల వెంకటేశ్వర్లు మండల కార్యదర్శి నల్లగట్ల మూర్తి మరియు కట్టం స్పందన,నర్సయ్య, సూరిబాబు, ముత్తయ్య, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ లో దరఖాస్తులకు ఆహ్వానం



నంగునూరు, మే 19, (తెలంగాణ పత్రిక):

నంగునూరు మండల పరిధిలోనీ నర్మెట్ట కేజీబీవీ లో 6 వ తరగతి నుండి 8 వ తరగతి మరియు ఇంటర్ ప్రథమ సంవత్సరం బిపిసి గ్రూపు లో సీట్ల కోసం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి కడతల పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంగ్లంలో బోధన ఉంటుంది, నీరుపేద బాలికలకు మంచి అవకాశమని అన్నారు. మౌలిక వసతులతో కూడిన వసతి గృహం విద్యార్థినీలకు అన్నిరకాల వసతులు, మెనూ ప్రకారం పౌష్టికాహారంతో కూడినబోజనం , నైపుణ్యం కలిగిన ఉపాధ్యనీలచే విద్యా బోధన చేయడం జరుగుతుందని అన్నారు. కావున పరిసర ప్రాంతాల వారు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పాఠశాల దగ్గర మొబైల్ టవర్ వద్దు


**-పంచాయితీకి గ్రామస్తుల వినతి**

నంగునూరు, మే 19(తెలంగాణ పత్రిక):



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం బద్దిపడగలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సమీపంలో నిర్మిస్తున్న ఎయిర్‌టెల్ మొబైల్ టవర్‌ను నిలిపివేయాలని కోరుతూ మంగళవారం గ్రామస్తులు పంచాయితీ కార్యదర్శికి వినతి పత్రం ఇచ్చారు. చిన్న పిల్లలు చదివే పాఠశాల పక్కన టవర్ ఏర్పాటు చేస్తే రేడియేషన్ వల్ల విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం టవర్‌ను దూరంగా మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు గొడుగు మహేశ్, ఉప్పర వినయ్ కుమార్, వడ్లూరి నరేశ్, గుగులోతు సాయి కుమార్, భూక్యా సంతోష్, బండి రాజు, మాలోతు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కల్లేపల్లి బంగారు మైసమ్మ తల్లి దేవస్థానం నిర్మాణ పనులను ప్రారంభించిన.. ఎమ్మెల్యే బిఎల్ఆర్

**-బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఉప సర్పంచ్ ధీరావత్ హుస్సేన్ నాయక్**

మిర్యాలగూడ ప్రతినిధి//మే 19:(తెలంగాణ పత్రిక):-

మిర్యాలగూడ నియోజకవర్గం లోని దామరచర్ల మండలం కల్లేపల్లి గ్రామంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ కల్లేపల్లి బంగారు మైసమ్మ తల్లి దేవస్థానం నిర్మాణ పనులనుప్రారంభించిన మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి స్థానిక ప్రజా ప్రతినిధులు ఆలయ కమిటీ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అధికారులు, కాంట్రాక్టర్ తో కలిసి గుడి నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం స్థానిక కాంగ్రెస్ నాయకులతో సమావేశం అయ్యారు. ఈ కార్యక్రమంలో కల్లేపల్లి బీఆర్ఎస్ పార్టీ ఉప సర్పంచ్ దీరావత్ హుస్సేన్ నాయక్ ని కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం లాంటి సంక్షేమ పథకాలు చూసి. అలాగే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకోసం పనిచేస్తున్న స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి నాయత్వంలో పనిచేసేందుకు బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతునట్టు తెలియజేసారు..ఈ కార్యక్రమంలో మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జల సంచయ్-జన భాగీదారీ కళాజాత బృంద అవగాహన కార్యక్రమం

మిర్యాలగూడ ప్రతినిధి//మే 19:(తెలంగాణ పత్రిక):-

మిర్యాలగూడ పురపాలక సంఘం ఆధ్వర్యంలో జల సంచయ్-జన భాగీదారీ జె ఎస్ జె బి కళాజాత బృంద అవగాహన కార్యక్రమం 27 వ వార్డ్ శాంతినగర్ లో నేడు విజయవంతంగా నిర్వహిం చబడింది. ఈ కార్యక్రమానికి వార్డు కౌన్సిలర్ గొట్టిముక్కుల ఝాన్సీ లక్ష్మణ్ వారు మాట్లాడుతూ నీటి పొదుపు, వర్షపు నీటి సంరక్షణ మరియు జల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం యొక్క ఆవశ్యకతను తెలియజేయడమే



ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. కళాజాత బృందం సాంస్కృతిక ప్రదర్శనలు, నినాదాలు మరియు చైతన్యవంతమైన కార్యక్రమాల ద్వారా ప్రజలకు జల సంరక్షణ సందేశాన్ని చేరవేసింది అని అన్నారు. ఈ కార్యక్ర మంలో వార్డు ప్రజలు. ఆర్ ఓ



జ్ఞానేశ్వరి,వెలుగు ఇందిరా నాగరాజు ఏపీ డి, సి ఓ, ఆర్ పి, ఎల్ ఎఫ్ లు,ఎస్ ఎల్ ఎఫ్ లు, స్వయం సహాయక బృందాల సభ్యులు,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థులకు సన్మానం

నంగునూరు, మే 19(తెలంగాణ పత్రిక);



తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. మంగళవారం హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో ఐ ఫౌండేషన్ నిర్వాకుడు ఎస్.రవీందర్ పదవ తరగతిలో 560 పైగా మార్కులు సాధించిన 33 జిల్లాల విద్యార్థులను, ఆయా పాఠశాలల ప్రధానోపా ధ్యాయులను సన్మానించారు. గట్లమల్యాల ఉన్నత పాఠశాల విద్యార్థి బి.అశ్విని(572 మార్కులు), పాఠశాల హెచ్.ఎం.మాదాసి రమేశ్ లను సన్మానించారు. ఈ కార్యక్రమములో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, హైదరాబాద్ జిల్లా విద్యాధికారి రోహిణి, రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాలువ సుజాత, జర్నలిస్ట్ తెలంగాణ విఠల్, ఐ ఫౌండేషన్ చైర్మన్ రవీందర్ పాల్గొన్నారు.

# మోతాదు మేరకే ఎరువులు వాడాలి

-వ్యవసాయ శాస్త్రవేత్త రమాదేవి



నంగునూరు, మే 19(తెలంగాణ పత్రిక):

వివిధ పంటల సాగులో సిఫారసు మేరకే ఎరువులను వాడాలని వ్యవసాయ శాస్త్రవేత్త రమాదేవి రైతులకు సూచించారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం నర్మేటలో మంగళ వారం తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త ఎ.రమాదేవి మాట్లాడుతూ వివిధ పంటల లో సిఫారసు మేరకు యూరియా వాడకం, నేల సంరక్షణ పద్ధతులు, పచ్చిరొట్ట ఎరువులు ప్రాముఖ్యత, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కలిగించారు. అనంతరం వ్యవసాయ బోధనా సహాయకుడు సురేందర్ రైతులు విత్తనాలు కొన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వరి సన్న రకాలు కెఎన్ఎం-1638, బీపీటీ-5204, డబ్ల్యూజీఎల్-44, డబ్ల్యూజీఎల్ 962, ఆర్ఎన్ఆర్15048 వంటివి బోనస్ రకాలని చెప్పారు. వివిధ పంటల్లో సాగు నీటిని ఆదాపై అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణ అధికారి ఎ.పవన్ మాట్లాడుతూ వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన సలహాలు సూచనలు పాటించి రైతులు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఎంపిటీసీ శనిగరం బాబు, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

# బైపాస్ రోడ్డుపై దుమ్ము రేపుతున్న మట్టి..

## ఇళ్లలోకి చేరుతోందని కాలనీవాసుల ఆవేదన



ఇల్లంతకుంట మే 19 తెలంగాణ పత్రిక

ఇల్లంతకుంట, మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డుపై మట్టి పేరుకుపోవడంతో వాహనాలు వెళ్లేటప్పుడు పెద్ద ఎత్తున దుమ్ము ఎగిసిపడుతోందని, ఆ దుమ్ము రోడ్డుకు ఆనుకొని ఉన్న ఇళ్లలోకి చేరి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం బైపాస్ కాలనీవాసులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శిని కలిసి వినతి పత్రం సమర్పించారు. రోడ్డుపై పేరుకుపోయిన మట్టిని వెంటనే తొలగించి, రోడ్డును శుభ్రం చేయించాలని కోరారు. దుమ్ము వల్ల పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారని వాపోయారు, అదేవిధంగా బైపాస్ రోడ్డు డివైడర్ మధ్యలో ఉన్న చెట్లు విపరీతంగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని, దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రమాదాల నివారణకు ఆ చెట్లను తొలగించి, వాటి స్థానంలో పూల మొక్కలు నాటాలని కొరారు. ఈ కార్యక్రమంలో బైపాస్ రోడ్డు కాలనీవాసులు పాల్గొన్నారు.

# జి.ఎం.ఆర్ వరలక్ష్మి సెంటర్ ద్వారా శిక్షణ పొందిన యువతకు ఉద్యోగ అవకాశాలు





భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 19

మంగళవారం న సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో జి.ఎం.ఆర్ వరలక్ష్మి సెంటర్ ఫర్ ఎంపవర్‌మెంట్ ద్వారా నిర్వహించిన వృత్తి విద్యా శిక్షణా కార్యక్రమాలలో శిక్షణ పొంది అనంతరం శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని సింధురి మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ సంస్థలో నెలకు రూ.28 వేల జీతంతో ఉద్యోగాలు పొందిన టి. వంశీకృష్ణ బి. కార్తీక్ అనే యువకులకు కొత్తగూడెం ఏరియా జి.ఎం ఎం. శాలేం రాజు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జి.ఎం మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సులు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఎంతో దోహద పడుతున్నాయని తెలిపారు. శిక్షణ కొరకు నమోదు చేసుకున్న అభ్యర్థులను సింగరేణి సంస్థ తమ స్వంత ఖర్చులతో శిక్షణ కేంద్రాలకు పంపించడం జరిగిందని పేర్కొన్నారు. జి.ఎం.ఆర్ వరలక్ష్మి సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలలో డ్రైవాల్ & ఫాల్స్ సీలింగ్, వెల్డింగ్ & ఫ్యాబ్రికేషన్, ఆటోమొబైల్ & టూ వీలర్, హోటల్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్, ఆర్ఏసీ టెక్నీషియన్, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ తదితర కోర్సుల్లో శిక్షణ అందించబడినట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాలలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయం, స్పోకెన్ ఇంగ్లీష్, బేసిక్ కంప్యూటర్ సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ కూడా అందించబడిందని తెలిపారు. శిక్షణ పూర్తిచేసిన వారికి ఇండస్ట్రీ గుర్తింపు పొందిన సర్టిఫికెట్లు అందించడంతో పాటు ఉద్యోగ అవకాశాల కల్పనలో సహకారం అందించబడినట్లు పేర్కొన్నారు. జి.ఎం.ఆర్ వరలక్ష్మి సెంటర్ ద్వారా శిక్షణ పొందిన పలువురు యువత ఇప్పటికే ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు సాధించడం ఆనందదాయకమని తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. భవిష్యత్తులో కూడా మరిన్ని ఉపాధి ప్రధాన శిక్షణా కార్యక్రమాలను నిర్వహించి యువతకు తోడ్పాటు అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన యువకులు తమకు శిక్షణతో పాటు అన్ని విధాల సహకారం అందించిన సింగరేణి సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జి.ఎం ఎం. శాలేం రాజు ఎస్.ఓ టు జి.ఎం కోటి రెడ్డి పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి వీటీసీ మేనేజర్ లక్ష్మణ్ ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్ ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మహిళలు ఆత్మస్థైర్యంగా ఉండి అన్ని రంగాల్లో ముందుకు రాణించాలి

-ఎం వి ఎన్ విజ్ఞాన కేంద్రం సేవలు అభినందనీయం గోలి అమరేందర్ రెడ్డి




మాడుగులపల్లి//నల్గొండ//మే 19:(తెలంగాణ పత్రిక):-

మహిళలు ఆత్మస్థైర్యంతో తగిన సమయంలో ప్రతిది నేర్చుకుంటే అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తారని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ గోలి అమరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం నాడు ఎంవియన్ విజ్ఞాన కేంద్రం మాడుగులపల్లి, ఇందుగులలో కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గోలి అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎంవిఎన్ విజ్ఞాన కేంద్రం టైలరింగ్ తో పాటు నల్లగొండలో అనేక విభాగాలలో పని చేయడాన్ని అభినందించారు. ఇక్కడ మీరు కుట్టు శిక్షణ నేర్చుకున్న తీరు చాలా ఆకర్షణగా, అందంగా కుట్టారని చెప్పారు. ఇక్కడ నేర్చుకున్నదే కాకుండా మీరు నిరంతరం సాధన చేయడం ద్వారా అనేక మార్గాలలో సంపాదించవచ్చని అన్నారు. మేము కూడా మీరు అభివృద్ధి కావడానికి కావలసిన సహాయ సహకారాలు చేస్తాను అని చెప్పారు. ఉద్యోగాలకు ప్రిపరేషన్ అవుతున్న అభ్యర్థులు సమయం వృధా చేయకుండా ఇష్టంగా చదవడం ద్వారా మనం అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటామని తెలిపారు. ఏ చిన్న అవకాశం దొరికిన దానిని ఉపయోగించుకొని ఎంచుకున్న గమ్యానికి చేరుకోవాలని అన్నారు. ప్రభుత్వాలు మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మహిళలను అన్ని రకాలుగా ప్రోత్సహించాలని కోరారు. మహిళలు స్వశక్తితో ఆర్థికంగా నిలబడినపుడే అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతారన్నారు. స్వయంశక్తితో ఆర్థికంగా ఎదిగినపుడే మహిళలు అన్ని రంగాలలో ముందుకు వెళ్లుతారని తెలిపారు. ప్రతి యువతి, మహిళ టైలరింగ్ తోపాటు బ్యూటీషియన్, చిన్నచిన్న వ్యాపారాల్లో నైపుణ్యం పెంచుకుంటే ఆర్థికంగా తమ కుటుంబానికి సహాయపడు తుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని అభివృద్ధిలోకి రావాలని విద్యార్థి, నిరుద్యోగ యువతకు పిలుపునిచ్చారు. ఎంవిఎన్ విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు స్వయం శక్తితో అభివృద్ధి చెందాలని ఆకాంక్షతోనే మాడుగు లపల్లి, ఇందుగుల గ్రామాలలో ఉచితంగా కుట్టు శిక్షణ కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. సమాజంలో నేటికి మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యల తోపాటు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచేందుకు, ఆత్మ రక్షణకు కరాటేలో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. సుగర్, బిపి, మూర్ఛ, పక్షవాతం రోగులకు ప్రతినెల మూడో అధివారం మందులు ఇస్తున్నట్లు చెప్పారు. ఇంకా ఈ గ్రంధాలయాన్ని కంప్యూటర్స్‌తో కూడిన డిజిటల్ లైబ్రరీగా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. వీటితో పాటు గ్రూపు2, బ్యాంక్ పిఓఎస్, డిఎస్సీ అభ్యర్థులకు అవగాహన కల్పించనున్నామని తెలిపారు. పేద విద్యార్థులు, నిరుద్యోగ యువతి యువకులకు మరియు ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా తమ ట్రస్టు పనిచేస్తుందన్నారు. వేసవి కాలంలో కంప్యూటర్, కరాటే, టైలరింగ్, చిత్రలేఖనం, డ్యాన్ నేర్పించనున్నట్లు చెప్పారు. మాసంస్థ ఇచ్చే అన్ని రకాల శిక్షణా కార్యక్రమాలను వినియోగిం చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజిక సేవకులు ఎస్ కే వి ప్రసాద్, ఎంవిఎన్ కార్యనిర్వాహక కార్యదర్శి పి నర్సిరెడ్డి, టైలరింగ్ ఫ్యాకల్టీలు రేణుక, మంగ, వివిధ రంగాల బాధ్యులు వెండి శ్రీనివాస్, పీ శ్రీ కర్, డి అశోక్ రెడ్డి, పత్తాని శ్రీనివాస్, నాగమణి, భూపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాపోలీసు అధికారులు,సిబ్బందికి యాన్యువల్ ఫైరింగ్ ప్రాక్టీస్

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 19





జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఆర్మడ్ రిజర్వ్ అధికారుల ఆధ్వర్యంలో జిల్లాలోని పోలీసు అధికారులు సిబ్బందికి వారం రోజుల పాటు యాన్యువల్ ఫైరింగ్ ప్రాక్టీస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలీస్ శాఖలో వినియోగించే అన్ని రకాల ఆయుధాలతో ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తారు. జిల్లాలోని మొత్తం 1469 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ఫైరింగ్ ప్రాక్టీస్ నకు హాజరు కానున్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా నిత్యం ప్రజలకు సేవలు అందిస్తూ విధులు నిర్వర్తించే పోలీసు అధికారులు,సిబ్బంది ప్రతి ఏడాది పోలీస్ శాఖలో వినియోగించే ఆయుధాలతో జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్,హేమచంద్రపురం నందు గల పోలీస్ ఫైరింగ్ రేంజ్ నందు ప్రాక్టీస్ చేయడం జరుగుతుంది. విడతల వారీగా జిల్లాలోని పోలీసు సిబ్బంది ప్రతి ఒక్కరూ ఈ ఫైరింగ్ ప్రాక్టీస్ నందు పాల్గొన్నారు.

# జటావత్ తండాలో చత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణ... ఎమ్మెల్యే బిఎల్ఆర్

మిర్యాలగూడ ప్రతినిధి//మే 19:(తెలంగాణ పత్రిక):-





మిర్యాలగూడ మండలం జటావత్ తండా లో మంగళవారం రోజు ధర్మ రక్షకుడు, హిందూ సామ్రాజ్య స్థాపకుడు, ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని విగ్రహాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ శివాజీ మహారాజ్ కేవలం ఒక వ్యక్తి కాదు. ఆయనో అజేయమైన శక్తి, ఒక చరిత్ర, మరియు ధైర్యానికి ప్రతీక, ఆయన జీవితం మనకు ఎన్నో గొప్ప పాఠాలను నేర్పుతుంది అని అన్నారు. పరాయి పాలనను ఎదిరించి, హిందూ స్వరాజ్యాన్ని స్థాపించిన మహనీయుడు మన శివాజీ శత్రువుల స్త్రీలను సైతం తల్లి సమానంగా గౌరవించిన గొప్ప సంస్కృతి శివాజీ మహారాజ్ ది అని అన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయని దృఢ సంకల్పం, ప్రజల సంక్షేమాన్ని కోరుకునే పరిపాలనా దక్షత ఆయన సొంతం. శివాజీ మహారాజ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంత వైభవంగా నిర్వహించిన యువతకు, కమిటీ సభ్యులకు మరియు గ్రామ ప్రజలందరికీ నా ప్రత్యేక అభినం దనలు అని అన్నారు. శివాజీ మహారాజ్ చూపిన ధైర్య సాహసాలు, దేశభక్తి మనందరికీ ఎల్లప్పుడూ తోడుగా ఉండాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు..

# అసమానతలు లేని సమాజం కోసం పోరాటం చేయడమే సుందరయ్యకు ఇచ్చే ఘనమైన నివాళి





-సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జె రమేష్

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 19

అసమానతలు లేని సమాజం కోసం పోరాటం చేయడమే పుచ్చలపల్లి సుందరయ్య కి ఇచ్చే ఘనమైన నివాళి అని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జె రమేష్ పిలుపునిచ్చారు.దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా ముందుగా సుందరయ్య చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎజె రమేష్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పేద, ధనికుల మధ్య తేడా, అంటరానితనం, స్త్రీ, పురుషుల మధ్య అసమానతల్లేకుండా సమాజం ఉండాలని సుందరయ్య భావించారని గుర్తు చేశారు. ఈ దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనీ, అందరికీ విద్యావైద్యం ఉచితంగా అందాలనీ, పేద, ధనిక వ్యత్యాసం లేకుండా ఉండాలని సుందరయ్య కోరుకున్నారని చెప్పారు. ప్రతి మనిషికీ పనిచేసే హక్కుండాలన్నారు. వాటికోసం ఆయన జీవితాంతం కృషి చేశారని అన్నారు. ఈ దేశంలో కొద్ది మంది చేతుల్లో సంపద పోగవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. భూస్వాముల చేతుల్లో, కార్పొరేట్ సంస్థల చేతుల్లో సంపద ఉంటున్నదని వివరించారు. ఈ దేశంలో ఒక్క శాతం సంపన్నుల వద్ద 40 శాతం సంపద, 10 శాతం సంపన్నుల చేతుల్లో 90 శాతం సంపద పోగయ్యిందని అన్నారు. అట్టడుగున ఉన్న 50 శాతం పేదల చేతుల్లో మూడు శాతం సంపద ఉందన్నారు. అందుకే దేశంలో పేదరికం, దరిద్రం ఉన్నదని చెప్పారు. ఈ భూమిపై అందరికీ సమాన హక్కు ఉంటుందనీ భూపంపిణీ జరగాలన సుందరయ్య ఆకాంక్షించారని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ఆయన నాయకత్వం వహించారని గుర్తు చేశారు. బాంచన్ దొర నీ కాల్మొక్తా అని అన్న పేదల చేతులతో బందూకులు పట్టించి తిరుగుబాటు చేసి భూస్వాములు, రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర ఉందని చెప్పారు. మూడు వేల గ్రామాలను విముక్తి చేసి ప్రజారాజ్యాలను ఏర్పాటు చేశారనీ, భూమిని పేదలకు పంచారని అన్నారు. వెట్టిచాకిరీని రద్దు చేశారని చెప్పారు. దేశంలో భూసంస్కరణల చట్టాన్ని సాధించారని వివరించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం స్ఫూర్తితో దేశంలోని ప్రజలంతా తిరుగుబాటు చేస్తారనీ, సోషలిస్టు వ్యవస్థ వస్తుందని ఆనాటి పాలకులు భావించారని అన్నారు. భారత సైన్యం, రజాకార్లు కలిసి తెలంగాణ సాయుధ పోరాటాన్ని అణచివేశారని చెప్పారు. ఈనాటికీ సుందరయ్య అందరికీ ఆదర్శమన్నారు. సామాజిక న్యాయం కోసం, వర్గదోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేశారని అన్నారు. ఆయన మార్గంలోనే సీపీఎం ప్రజల తరపున పోరాటాలను నిర్మిస్తుందన్నారు. దోపిడీ లేని సమాజం కోసం పోరాటంలో పాల్గొని తమ హక్కుల సాధనకై కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ సిఐటియు రాష్ట్ర కార్యదర్శి మంద నరసింహారావు నాయకులు నందిపాటి రమేష్ సూరం ఐలయ్య ఆలేటి శ్రీనివాస్ వై వెంకటేశ్వరరావు గడల నరసింహారావు ఎమ్మెస్ ప్రకాష్ రాజారావు రమేష్ బాబు నాగక్రిష్ణ బాలకృష్ణ రాములు రఘు నాగదుర్గ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చపల్లి సుందరయ్యకు ఘన నివాళి

వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 19 (తెలంగాణ పత్రిక):





వెల్దుర్తి మండలంలో సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో కమ్యూనిస్టు ఉద్యమ ప్రముఖ నేత పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, హమాలి కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొని సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా సిపిఎం కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య కార్మిక వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహానేత అని కొనియాడారు. పేదలు, కార్మికులు, రైతుల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్మికుల ఐక్యత, సామాజిక సమానత్వం కోసం ఆయన చూపిన మార్గంలో నేటి తరాలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న హమాలి కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు సుందరయ్య ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొంటూ ఆయనకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల సిపిఎం కార్యదర్శి గౌరీ, అమాలి సంఘం కార్మికులు వెంకటేష్, లక్ష్మణ్, బాబు, మైసయ్య, సుదర్శన్, కార్మిక కార్మిక సంఘం నాయకులు నరేందర్ రైతు సంఘం నాయకులు రాము మరియు వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జారె

తెలంగాణ పత్రిక/దమ్మపేట(మే 19)



దమ్మపేట మండల కేంద్రంలో గల టిటిడి కళ్యాణమండపం ఎదురుగా గల విశ్రాంత ఉపాధ్యాయుల భవన కాంపౌండ్ వాల్ నిర్మాణానికి మంగళవారం అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ సర్పంచ్ పగడాల రమాదేవి తో కలిసి ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపి డైరీ, క్యాలెండర్ అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల విశ్రాంతి భవనము ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వినియోగిస్తూ పలువురికి ఉపయోగకరంగా ఉండటం సంతోషకరంగా ఉందని, ప్రహరీ ఉంటే భద్రత ఉంటుంది అనే ఉద్దేశ్యంతో నిర్మాణం చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ సందర్భంగా 12వ వార్డు సభ్యురాలు సరిత నెమలిపేట ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణం కట్టాలని ఎమ్మెల్యేని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కక్కిరాల రమేష్, ఆత్మ కమిటీ సభ్యులు పగడాల కృష్ణారావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దాసరోజు సరిత రామారావు, మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శంకరవరం అయ్యప్ప, ధర్మసోతు నరేష్, పిట్టల శ్రీనివాసరావు, వనమాల వసంత, విశ్రాంతి ఉద్యోగులు రావెల్లి అజయ్ కుమార్, దారా నాగేశ్వరరావు, సదాశివరావు, తునికిపాటి సత్యనారాయణ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు చేయడం లేదంటూ రైతన్నల ఆందోళన

-రోడ్డెక్కిన ఎం జలాల్పూర్ రైతులు

-తాసిల్దార్, ఎస్సై హామీతో ఆందోళన విరమణ



వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 19 (తెలంగాణ పత్రిక):

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మన్నె వారి జలాల్పూర్ లో ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని వెల్దుర్తి మండలం మన్నె వారి జలాల్పూర్ రైతులు ఆందోళనకు దిగారు. తమ గ్రామంలో సుమారు 25 లారీల వడ్లు ఉండగా ఇప్పటివరకు రెండు లారీలే ప్రభుత్వం కొనుగోలు చేసిందని ఆగ్రహించిన రైతులు మంగళవారం గ్రామ వెల్దుర్తి నర్సాపూర్ ప్రధాన రహదారి పై బైఠాయించి ధర్నా చేపట్టారు. సుమారు మూడు గంటల పాటు రైతులు ఆందోళన చేయడంతో వాహనాలు స్తంభించిపోయాయి. వాహనదారులు, ప్రజలు ఎండ తీవ్రత బాగుండడంతో ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్సై రాజు, తహశీల్దార్ శ్రీనివాసులు అక్కడికి చేరుకొని రైతులను సముదాయించారు. లారీలు తెప్పించి పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

# పాత పద్ధతిలోనే అర్హులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి

-తొలుత కమిటీ సభ్యులకు, జిల్లాకు 4 కార్డులు ఇస్తామంటే తిరస్కరించిన కమిటీ.

-ఎమ్ పానల్ లో ఉన్న పత్రికల్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి జర్నలిస్టు కు కార్డులు ఇవ్వాలని కమిటీ తీర్మానం.

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 19




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రభుత్వ కొత్త జీవో 252 నిబంధనలు పాత్రికేయులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని భద్రాద్రి జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు కలెక్టర్ ముందు అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. పెద్ద పత్రికల విషయంలో నిబంధన ప్రకారం మంగళవారం అక్రిడేషన్ కమిటీ సభ్యులతో పాటు నాలుగు కార్డులు అందిస్తామని డి పి ఆర్ ఓ ప్రస్తావన చేయగా జిల్లా కమిటీ జిల్లా కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తిరస్కరించారు. తమకు కార్డు ప్రస్తుతం అవసరం లేదని జిల్లాలోని మండలాల రిపోర్టర్లకు కార్డు అందించినప్పుడే తాము కూడా తీసుకుంటామని స్పష్టం చేయడం జరిగింది. జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రభుత్వం నిబంధన ప్రకారం పెద్ద పత్రికలు తొలుత నాలుగు కార్డులను మంజూరు చేస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మండలాల్లో చిన్నప్పుడే ఆ నాలుగు కార్డులు కూడా తీసుకోవడం జరుగుతుందని కమిటీ సభ్యులు కలెక్టర్ ముందు స్పష్టం చేశారు. ఎం పానల్లో ఉన్న ప్రతి పత్రికకు ఎలక్ట్రానిక్ ఛానల్లకు, కేబుల్ ఛానల్కు సైతం కార్డులు ఇవ్వాలని కమిటీ సభ్యులు పట్టుబట్టారు. దీని పట్ల స్పందించిన కలెక్టర్ జిల్లాలో ఏ రిపోర్టర్కును అన్యాయం జరగకుండా చూస్తామని మీకు సంబంధించిన డిమాండ్లు ఏమైనా ఉంటే దరఖాస్తు సమర్పించాలని సూచించారు. పెద్దపత్రికలకు జిల్లా కేంద్రంలో, కార్పొరేషన్, భద్రాచలం టెంపుల్ ఏరియా, నియోజకవర్గాల తోపాటు ఎలక్ట్రానిక్ మీడియా కు జిల్లాలో 9 కార్డులు, కేబుల్ చానళ్లకు కూడా డిస్ట్రిక్ట్ కార్డులు ఇవ్వాలని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేసి కలెక్టర్ కు అందించారు. తీర్మాన కాపీని స్వీకరించిన కలెక్టర్ ఐ ఎన్ పి ఆర్ కమిషనర్ తో మాట్లాడి జిల్లాలోని జర్నలిస్టులు అందరికీ న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో డిపిఆర్ఓ అజ్గర్ హుస్సేన్, కమిటీ సభ్యులు కల్లోజీ శ్రీనివాస్, బి వి. రమణారెడ్డి, వట్టి కొండ రవి, ఎం ఏ. వాహెద్, జి. వెంకటేశ్వర్లు, మొబగాపు ఆనంద్, మాటేటి మధు, ఎండి. యాకుబ్ పాషా, నాగ చంద్ర, ప్రశాంత్, ఆర్టీసీ అధికారి వైఎన్ రావు, పిల్లి రాజేష్, ఫణికుమార్, మోక్షిత్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తిని తీర్చాలి ప్రజావాణిలో ఫిర్యాదు మహేష్ యాదవ్

తెలంగాణ పత్రిక న్యూస్ ప్రతినిధి శేర్లింగంపల్లి మే 19.





ప్రజల దాహార్తిని తీర్చాలని (హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఎస్ బి) హాఫిజ్ పెట్ డివిజన్ ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన బోయిని మహేష్ యాదవ్. హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రత కారణంగా సాధారణ ప్రజలు. కార్మికులు. పాదాచారులు.తీవ్ర దాహార్తితో ఇబ్బంది పడుతున్నారు. హాఫిజ్ పెట్ డివిజన్ పరిధిలో స్వచ్ఛందంగా ఏర్పాటు చేసిన చలివేంద్ర కేంద్రాలకు త్రాగునీటి సరఫరా కల్పించాలంటూ పలుమార్లు (హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఎస్ బీ )అధికారులను కోరిన ప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరం.ఒకవైపు కమర్షియల్ వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని విక్రయించడం పై అధికారులు చూపుతున్న శ్రద్ధ మరోవైపు బీద ప్రజల దాహార్తిని తీర్చే చలివేంద్ర కేంద్రాల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించడం అత్యంత దురదృష్టకరం. ప్రజలకు ఉచితంగా మంచినీళ్లు అందించేందుకు సేవాభావంతో నిర్వహిస్తున్న చలివేంద్ర కేంద్రాలకు ప్రభుత్వం మరియు (హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఎస్ బి) వెంటనే స్పందించి ఉచిత వాటర్ ట్యాంకర్ల ద్వారా కుండలలో తాగునీటిని నింపే ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేస్తున్నాము. ముఖ్యంగా మియాపూర్. హాఫిజ్ పెట్. ఆల్విన్ కాలనీ.పరిసర ప్రాంతాల్లో ప్రజల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రజా సంక్షోమాన్ని సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని. తక్షణ చర్య చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము అని ప్రజల ప్రాణాలకు సంబంధించిన ఈ అంశాన్ని అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలని ఈ సందర్భంగా బోయిని మహేష్ యాదవ్ ప్రజావాణి ద్వారా పలువురుతో కలిసి విజ్ఞప్తి చేశారు.

## ఎంసెట్‌లో సత్తా చాటిన బాబు క్యాంప్ విద్యార్థి

**-రాష్ట్ర స్థాయిలో 340వ ర్యాంకు సాధించిన ఈలందండి కౌశిక్ చరణ్**

కొత్తగూడెం, మే 19 (తెలంగాణ పత్రిక) :



కొత్తగూడెం బాబు క్యాంప్ కు చెందిన ఈలందండి కౌశిక్ చరణ్ ఎంసెట్ పరీక్షలో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో 340వ ర్యాంకు సాధించాడు. 103.72 నార్మలైజ్డ్ మార్కులు సాధించి జిల్లాకు గర్వ కారణంగా నిలిచాడు. కౌశిక్ చరణ్ తండ్రి ఈలందండి సదా మోహన్, తల్లి శారద. పరీక్షలో గణితంలో 54.76 మార్కులు, ఫిజిక్స్‌లో 26.58 మార్కులు, కెమిస్ట్రీలో 22.37 మార్కులు సాధించి తన ప్రతిభను చాటుకున్నాడు. కుమారుడు సాధించిన విజయంపై కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. కృషి, పట్టుదలతో చదివి ఈ విజయాన్ని సాధించాడని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, స్నేహితులు, బంధువులు కౌశిక్ చరణ్‌ను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు

**-జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ**
**-దరఖాస్తులకు ఆహ్వానం**
**-అందించే కోర్సులు.. అర్హతలు**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 19, తెలంగాణ పత్రిక

ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్ (మహిళలకు) కోర్సు వ్యవధి - 90 రోజులు అర్హత: 10వ తరగతి, టైలరింగ్ (మహిళలకు మాత్రమే) కోర్సు వ్యవధి - 60 రోజులు, అర్హత: 5 వ తరగతి హోం హెల్త్ ఎయిడ్ (మహిళలకు మాత్రమే) కోర్సు వ్యవధి - 90 రోజులు, అర్హత: 10 వ తరగతి

**-ఉచిత శిక్షణ.. భోజన వసతి**

ఉత్తమ శిక్షణ, కంప్యూటర్ శిక్షణ తరగతలు, అధునాతన తరగతి గదులు, యోగా, వ్యక్తిత్వ వికాస తరగతులు, ఉచిత భోజన వసతి సౌకర్యం అందుబాటులో ఉంది.అలాగే వారాంత, పక్షాంత, మాసాంతర పరీక్షలు నిర్వహిస్తారు. స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు బోధిస్తారు.ప్రతి 3 నెలలకు ఒక బ్యాచ్ ప్రారంభమవుతుంది.శిక్షణ పొందాలనుకునేవారు 19 ఏండ్ల నుంచి 30 ఏండ్ల లోపు వయసు వరకు ఉండాలి.

**-ఇవీ కావాల్సిన ధృవీకరణ పత్రాలు**

ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు 3, విద్యార్హత ధృవీకరణ పత్రాలు, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్, రేషన్ కార్డు, కులధృవీకరణ పత్రం సమర్పించాలి.అడ్రస్, కోనరావుపేట మండలం నాగారంలో ట్రైనింగ్ ఇచ్చే కేంద్రం ఉంది. మిగతా వివరాలకు సంప్రదించాల్సిన నెంబర్లు 9848685428, 9491566790.

## పదిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం

ఇల్లంతకుంట మే 19 తెలంగాణ పత్రిక



అలయన్స్ క్లబ్ ఇల్లంతకుంట ఆధ్వర్యంలో బుధవారం, తేదీ 20.05.2026న మండల కేంద్రంలోని జలపతి రెడ్డి ఫంక్షన్ హాల్‌లో పదో తరగతి టాపర్ల సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు బండారి నర్సయ్య తెలిపారు.మండలంలోని అన్ని పాఠశాలల్లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను ఈ కార్యక్రమంలో ఘనంగా సన్మానించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని టాపర్లందరూ బుధవారం సాయంత్రం 7 గంటలకు హాజరుకావాలని కోరారు. ఈ సన్మాన కార్యక్రమానికి అలయన్స్ ఇంటర్నేషనల్ మెంబర్, అలయన్స్ ట్రస్టు చైర్మన్ డా. ఎలగందుల శ్రీనివాస్, అలయన్స్ జిల్లా గవర్నర్ కున్జెర్ల మహేష్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను సన్మానిస్తారని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఒక ప్రకటనలో తెలిపారు.

## వృద్ధురాలికి చేయూత

**-మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 19, తెలంగాణ పత్రిక




భీంగల్ వాస్తవ్యురాలు జంబుక రాజలింగు 55 సంవత్సరాలు రాజన్న రాజన్న ఆలయానికి వచ్చి అక్కడ ఏడుస్తూ కూర్చున్న ఆమెను హోంగార్డు పద్మ గమనించి ఆవిడ వద్ద నుండి వివరాలు తీసుకుని జంబుక రాజలింగు అనే ఆవిడను వృద్ధాశ్రమానికి పంపించాలి అని మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ వారికి సమాచారం అందించడంతో ఆవిడను వేములవాడ పట్టణ పోలీసు స్టేషనుకు తీసుకెళ్లి వారి అనుమతితో ఓబులాపురం లోని అమ్మ అనాధ శరణాలయనికి పంపించడం జరిగిందని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ హోం గార్డు పద్మ పాల్గొన్నారు.

# పెన్షన్ ఆశ చూపి 80 ఏళ్ల వృద్ధురాలి ఇంటి స్థలం కబ్జా

**-సర్పంచ్ భర్త, తహసీల్దార్లపై ఆరోపణలు.**
**-జిల్లా కలెక్టర్‌కు గంగవ్వ ఫిర్యాదు.**

బుగ్గారం మండలం (తెలంగాణ పత్రిక) మే 19



జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం చిన్నాపూర్ గ్రామానికి చెందిన 80 ఏళ్ల వృద్ధురాలు ముస్సె గంగవ్వ ఇంటి స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని జిల్లా కలెక్టర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. పెన్షన్ ఇప్పిస్తామని నమ్మించి, తన పెద్ద కుమారుడు రాజేశంతో కుమ్మక్కై అధికార పార్టీ సర్పంచ్ భర్త గట్టు గంగారం 6 గుంటల ఇంటి స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని గంగవ్వ ఆవేదన వ్యక్తం చేశారు.

**-చట్టవిరుద్ధంగా తహసీల్దార్ ఆఫీసులో రిజిస్ట్రేషన్**

ఇంటి స్థలం కావడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ జరగాలి. కానీ బుగ్గారం తహసీల్దార్ కార్యాలయంలో చట్ట విరుద్ధంగా రిజిస్ట్రేషన్ నిర్వహించారని బాధితురాలు ఆరోపించారు. అనంతరం గట్టు గంగారం ఆ స్థలాన్ని గడ్డం మహేష్‌కు, అతను గణవేణి వెన్నెలకు విక్రయించినట్లు తెలిపారు.

**-ఆధారాలున్నా అన్యాయం**

జగిత్యాల సబ్ రిజిస్ట్రార్ ఈసీ లో తన కుమారులు రాజలింగం, లింగం పేర్లు ఉన్నాయని, ఇదే స్థలంలో ఉన్న 1-46 ఇంట్లో తాను నివసిస్తూ పంచాయతీకి ప్రతి ఏటా పన్ను చెల్లిస్తున్నానని గంగవ్వ తెలిపారు. అన్ని ఆధారాలు ఉన్నా అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ జరిపించడం అనుమానాలకు తావిస్తోందని వాపోయారు.

**-ప్రహరీ గోడకు అడ్డు**

ఒంటరిగా నివసిస్తున్న తనను రక్షణ కోసం ప్రహరీ గోడ కట్టుకోనీయకుండా గణవేణి వెన్నెల, ఆమె కుటుంబ సభ్యులు అడ్డుకుంటున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో ప్రహరీ గోడతో పాటు ఇంటి నిర్మాణానికి అనుమతి కోసం జిపి లో దరఖాస్తు చేసుకున్నానని గంగవ్వ తెలిపారు. అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి, ప్రహరీ గోడ నిర్మాణానికి అనుమతి ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు.అలాగే అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న గట్టు గంగారాం, గడ్డం మహేష్, గణవేణి వెన్నెల పై చట్ట రీత్యా చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని గంగవ్వ వినతిపత్రంలో కోరారు.

# జిల్లాలో డ్రగ్స్,గంజాయి నిర్మూలనకు ప్రత్యేక తనిఖీలు





**-ఎల్లారెడ్డిపేట మండలంలో కిరాణా, పాన్ షాప్స్,బస్టాండ్ ప్రాంతాలలో నార్కోటిక్ జాగిలంతో తనిఖీలు నిర్వహణ.**
**-మత్తు పదార్థాల విక్రయాలు,రవాణాపై కఠిన చర్యలు తప్పవు.**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 19, తెలంగాణ పత్రిక

ఎల్లారెడ్డిపేట మండలంలోని కిరాణా, పాన్ షాప్స్,బస్టాండ్ పరిసర ప్రాంతాలలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా మరియు విక్రయాలను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు ఈరోజు పోలీసు అధికారులు నార్కోటిక్ సహాయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజల సహకారంతోనే మత్తు పదార్థాల నిర్మూలన, భద్రతా చర్యలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.

# అమృత ఫలం జామ,జామ పండ్లను తిందాం,ఆరోగ్యంగా ఉందాం

**-లెక్చరర్ ఉమాశేషా రావు**

కామారెడ్డి, మే 19, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



చక్కెర వ్యాధిని కంట్రోల్ చేయగలిగేఏకైకఔషధంజామకాయ.ప్రపంచ ఆ రోగ్య సంస్థ లెక్కల ప్రకారంప్రపంచ వ్యాప్తంగా ప్ర జలు ఏ రోగాలతో అత్యధికంగా చనిపోతున్నారు అనే విషయాలని ఎన్నో సార్లువెల్లడించింది.అందు లో ముఖ్యంగా గుండె సంబంధిత వ్యాధు లతో అత్య ధికంగా ప్రజలు చనిపోతుం టే..రెండవ స్థానం మాత్రం చెక్కెర వ్యాధితో ప్రజలు చని పో తున్నారని తేల్చి చెప్పిం ది. ప్రపంచ వ్యాప్తంగా దయాబెటిస్ వ్యాధి తీవ్ర రూపం దాల్చిందని, దీని ప్రభావానికి చిన్న పిల్లలు సైతం లోనవుతున్నారని తెలిపింది.అయితే దయా బెటిస్ ఉన్న వాళ్ళు ఈ షు గర్ లెవిల్స్ కంట్రోల్ చేసుకుంటే ఎలాంటి ప్రమాదం ఉండ దని అంటున్నారు నిపుణులు. మరి షుగర్ లెవిల్స్ ని కంట్రోల్ చేయడం ఎలా?షుగర్ లెవిల్స్ ని కంట్రోల్ చేయ డానికి జామకా యలు ఎంతగానో ఉప యోగ పడుతాయి.వీటిని రెగ్యులర్ గా తీసుకుంటే మంచి ఫలితాలు పొంద వచ్చు అంటున్నారు నిపుణులు. జామకాయలో పీచు పదార్థం ఎక్కువగా ఉం టుంది. ఇది బ్లడ్ లో షుగర్ లెవిల్స్ ని చెక్ చేస్తుంది. జామలో ఉండే గ్లైకమిక్ ఇండెక్స్ తొందర గాఅరగనివ్వవు.దాంతో రక్తంలో గ్లూకోజ్ లెవిల్స్ ఒక్క సారిగా పెరగకుండా ఉంటాయి.ఫలితంగా బ్ల డ్ లో లెవిల్స్ ని కంట్రోల్ చేస్తుంది.అందుకే వైద్యులు దయాబెటిస్ రోగులకి జామ కాయలు ఎక్కు వ గా తీసుకోమని సూ చిస్తారు.అంతేకాదు బరువు తగ్గాలని అనుకునే వారు కూడా జామకాయ తినవచ్చు ఎందుకంటె జామకాయలో కేలరీస్ తక్కువగా ఉంటాయి. అత్యధిక బరువు ఉన్న వారికి కూడా షుగర్ వచ్చే ప్రమాదాలు ఎక్కువగా కాబట్టి జామ కాయ తినడం ద్వారా బరువు తగ్గివి విధవ్యాధుల నుంచీ కాపాడుకోవచ్చు. షు గర్ ని కంట్రోల్ లోఉంచడానికి సోడియం, పొటాషియం రెండూ కావాలి ఈ రెం డూ జామకాయలో పు ష్కలంగా లభిస్తాయి. సి విటమిన్ కోసం అందరూ నిమ్మకాయ, నారింజ తినాలని అంటా రు. కానీ జామకాయలో "సి విటమిన్" నాలుగు రెట్లు అధికంగా ఉంటుంది. దయాబెటిస్ ఉన్న వారికి రోగ నిరోధక శక్తి అధికంగా ఉండాలి. జామలో రోగ నిరోధక శక్తిని అందిం చే కారకాలు లెక్క కి మించే ఉంటాయి.

# అసైన్డ్ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి: జింక శ్రీధర్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 19, తెలంగాణ పత్రిక




రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బహుజన సేన రాజన్న సిరిసిల్ల ఆర్గనైజేషన్ మరియు భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో దళిత, గిరిజన నిరుపేద అర్హులకు కేటాయించిన ప్రభుత్వ అసైన్డ్ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో వారి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బహుజన సేన రాజన్న సిరిసిల్ల ఆర్గనైజేషన్ అధ్యక్షులు జింక శ్రీధర్ మాట్లాడుతూ సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రాజీవ్ నగర్, ముష్టిపల్లిలోని సర్వే నంబర్ 51లో సుమారుగా రెండు ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమి ఆక్రమణకు గురైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారని, ఆ ఫిర్యాదుపై అధికారులు చేసిన విచారణను ప్రజలకు తెలుపాలని కోరుతూ, మరియు తంగళ్ళపల్లి మండలం సారంపల్లి గ్రామంలోని సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారి సమీపంలో ఉన్న ప్రభుత్వ అసైన్డ్ భూమి స్థానికేతరులైన సిరిసిల్ల పట్టణానికి చెందిన వ్యక్తిపై రిజిస్ట్రేషన్ అయి ఉండడం 1977 చట్టం నిబంధనలకు వ్యతిరేకమని అన్నారు. అసైన్డ్ భూమి స్థానిక దళిత గిరిజన నిరుపేద అర్హులకు ప్రభుత్వం అందించాలని చట్టాలు సూచిస్తున్నప్పటికీ చట్ట వ్యతిరేకంగా స్థానికేతరులు అసైన్డ్ భూమిని ఆక్రమిం చడంపై అధికారులు విచారణ జరిపి దళిత గిరిజన అర్హులైన నిరుపేద ప్రజలకు అందించాలని అధికారులను కోరారు. బహుజన సేన జిల్లా అధ్యక్షులు జింక శ్రీధర్, భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు దొబ్బల ప్రవీణ్, బహుజన సేన గౌరవ అధ్యక్షులు గుడిసె మనోజ్ కుమార్, ఉపాధ్యక్షులు బానోత్ శ్రీకాంత్ నాయక్, యంగ్ మ్యాన్ అంబేద్కర్ రిస్ట్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు పెరుమండ్ల శ్రీకాంత్, పడిగె మహేష్, సిరిగిరి రాము, సుంకపాక వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# బోయినిపల్లి లో ఘనంగా సుందరయ్య వర్ధంతి

**-సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్ బాబు**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 19, తెలంగాణ పత్రిక

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత పనిగట్టుకునిమత విద్వేషాలను పెంచుతుందని పేదల ఐక్యత కోసం సుందరయ్య స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఈ స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు మంగళవారం కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 41 వ వర్ధంతి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్పల్లి మండల కేంద్రంలో డప్పు చప్పుళ్లతో సుందరయ్య చిత్రపటాలతో ప్రదర్శన నిర్వహించారు.మండల కేంద్రంలో సిపిఎం అరుణ పతాకాన్ని ఎగరవేశారు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం మండల కేంద్రంలోని ఆర్ఎంపి పిఎంపి భవన్ లో సిపిఎం ఆధ్వర్యంలో కార్మిక వర్గ ఐక్యత సవాళ్లు కర్తవ్యాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు సిపిఎం మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్ అధ్యక్షత వహించారు ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టీ స్కైలాబ్ బాబు మాట్లాడుతూ త్యాగానికి నిలువెత్తు నిదర్శనం ఆదర్శాలలో ఎవరెస్టు శిఖరమైన దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి స్ఫూర్తితో నేటి తరం ఉద్యమించాలని పిలుపునిచ్చారు ఆదర్శవంతమైన విలువలతో రాజకీయాలు చేయడం కమ్యూనిస్టులకే సాధ్యమని దీనికి సుందరయ్య జీవితమే ఆదర్శమని అన్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ భూస్వామ్య పెత్తందారి విధానాలకు వ్యతిరేకంగా చిన్ననాటి నుండే పోరాటం చేసిన మహా నాయకుడిని అన్నారు. తెలంగాణలో భూస్వామ్య జమీందారీ రజాకార్లకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం సాగించడంలో కీలకపాత్ర వహించారని, వ్యవసాయ కార్మికులకు కూలీ పెరగాలని, భూమి పంచాలని సంఘం సంఘం పెట్టి కూలి భూమి పోరాటాలు చేశారని వారు అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం 29కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడలు తీసుకొచ్చి కార్మికుల పొట్టలు కొట్టి కార్పొరేట్ల బొజ్జలు నింపడానికి ప్రయత్నిస్తుందన్నారు మత విద్వేషాలే తప్ప మనుషుల బాగోగులు పట్టడం లేదన్నారు దళితులు గిరిజనులు బలహీన వర్గాలపై దాడులు పెంచడం ద్వారా బిజెపి తన పబ్బం గడుపుకుంటుందని చెప్పారు మతోన్మాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పేదలు కష్టజీవుల ఐక్యత సాధించడమే సుందరయ్యకు అర్పించే నివాళి అని ఆయన అన్నారు.ఈ వర్ధంతి సభలో విజ్ఞాన దర్శిని రాష్ట్ర అధ్యక్షులు బొల్లి ఆధామ్ రాజ్ సిపిఎం మండల నాయకులు రామంచ అశోక్ కుడుకల గిరిబాబు, కొత్తూరు నరసయ్య అల్వాల అంజయ్య ఎడపల్లి బాబు బొజ్జ శ్రీను అనుముల రవి ఆవుల మల్లయ్య కోరెన్ మహేష్ రాజనర్సు పాటల గోపి తదితరులు పాల్గొన్నారు.



# ప్లాట్లుగా పచ్చని పొలాలు.. రియల్ ఎస్టేట్ విస్తరణతో కనుమరుగు కానున్న వ్యవసాయం

కామారెడ్డి , మే 19,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లాతాడ్వాయి మండలంలో రియల్ ఎస్టేట్ వెంచర్ల విస్తరణతో పచ్చని పంట పొలాలు కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్నాయి. వ్యవసాయ రంగంలో కష్టం ఎక్కువ, ఆదాయం తక్కువ కావడంతో గ్రామీణ యువత నగరాల వైపు వలస వెళ్తోంది.తాడ్వాయి మండలంలో రియల్ ఎస్టేట్ వెంచర్ల విస్తరణతో పచ్చని పంట పొలాలు కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్నాయి. వ్యవసాయ రంగంలో కష్టం ఎక్కువ, ఆదాయం తక్కువ కావడంతో గ్రామీణ యువత నగరాల వైపు వలస వెళ్తోంది. పల్లెల్లో కేవలం వృద్ధులు, కూలీలు మాత్రమే మిగులుతుండడంతో సాగు చేసే తరం క్రమంగా తగ్గిపోతోంది. నాయకుల పిల్లలు విదేశాల్లో స్థిరపడుతుంటే, రైతుల పిల్లలు గల్ఫ్ దేశాలకు కూలీలుగా వెళ్లాల్సి వస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు, దళారుల దోపిడీ, గిట్టుబాటు ధర లేకపోవడంతో అన్నదాతలు అప్పులపాలవుతున్నారు. ప్రభుత్వాలు మారినా ప్రచార ఆర్భాటాలే తప్పా, రైతు సంక్షేమ హామీలు క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. పంటను అమ్ముకుందామన్నా కొనుగోలు కేంద్రాల్లో హమాలీ ఛార్జీలు, తరుగు పేరుతో అన్నదాత దోపిడీకి గురవుతున్నాడు. వ్యవసాయాన్ని కాపాడుకోకపోతే భవిష్యత్తులో ఎంత డబ్బున్నా ఆహారం దొరకని దుస్థితి వస్తుందని మేధావులు హెచ్చరిస్తున్నారు.



కామారెడ్డి జిల్లాలో జిల్లా కేంద్రం చుట్టూ మండలాలలో గ్రామాలలో ఎల్లారెడ్డి బాన్సువాడ గాంధారి లింగంపేట్ దోమకొండ బీబీపేట బిక్కనూర్ రాజంపేట రామారెడ్డి మాచారెడ్డి పాల్వంచ మండలాల్లో అక్రమ వెంచర్లు కోకోలుగా వెలుస్తున్నాయి అధికారులు వీటి గురించి పట్టించుకోవడం లేదు అన్న ఆరోపణలు ఉన్నాయి ఇలాంటి అనుమతి లేకుండా అని వెంచర్లనే ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయిస్తూ కొనుగోలుదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పచ్చని పొలాలను క్లాతులుగా మారుస్తుండడంతో ముందు తరానికి వ్యవసాయం కనుమరుగయ్యే అవకాశాలు ఉన్నాయని నలుగురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అనుకూలంగా లేని భూములను వెంచర్ల ఏర్పాటుకు ఎంచుకుంటే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు. ఒకప్పుడు పచ్చని పంటలతో, పక్షుల కిలకిలారావాలతో సందడిగా కనిపించిన గ్రామాలు నేడు క్రమంగా కాంక్రీట్ జంగిల్‌గా మారిపోతున్నాయి. పట్టణీకరణ ప్రభావంతో వ్యవసాయ భూములు రియల్ ఎస్టేట్ వెంచర్లకు మార్గం చూపుతున్నాయి. ఎటు చూసినా ప్లాట్లు, సిమెంట్ రోడ్లే కనిపిస్తున్నాయి తప్ప, రాబోయే తరాలకు ఆహారం అందించే పచ్చని పంట పొలాలు కనుమరుగవుతున్నాయి. 'రైతు రాజు' అన్న మన నాయకులు రైతును కర్మరుగు చేసే విధంగా వ్యవహరిస్తున్నారని మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఆర్‌పీల కమిషన్ దందాపై ఫిర్యాదు తదుపరి నివేదిక ఇస్తామని కమిషనర్ హామీ

తెలంగాణ పత్రిక మే 19 జగిత్యాల జిల్లా ప్రతినిధి



జగిత్యాల జిల్లాలో మెప్మా మహిళా సంఘాల రుణాల వ్యవహారంలో ఆర్‌పీల కమిషన్ దందా జరుగుతోందనే ఆరోపణలపై మహిళా సంఘాల సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీఎంసీ స్థాయిలో సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే లోన్ల పంపిణీలో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని వారు ఆరోపించారు. లోన్ల పేరుతో పేద మహిళల నుంచి అదనపు వసూళ్లు చేస్తున్నారని పేర్కొంటూ సోమవారం జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.ఈ ఆరోపణలకు సంబంధించిన పలు ఆధారాలు, పత్రాలు,లావాదేవీల వివరాలను కమిషనర్‌కు సమర్పించినట్లు మహిళలు తెలిపారు.దఫిర్యాదుపై స్పందించిన కమీషనర్ ఆధారాలను పరిశీలించి పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించిన అనంతరం తగిన సమాచారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు మహిళలు వెల్లడించారు.మహిళా సంఘాల సభ్యులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్న ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఈ అంశం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.పూర్తి స్థాయి లో న్యాయం జరగని పక్షంలో జిల్లా కలెక్టర్ కు పూర్తి ఆధారాలతో కలిసి మా యొక్క సమస్యలు వివరిస్తామని చెప్పడం కొస మెరుపు.

# బోవనపల్లి పరిధిలో ఉపాధి హామీ పనులు పరిశీలించిన ఫీల్డ్ అసిస్టెంట్-అబ్బు శీను



వాజేడు తెలంగాణ పత్రిక మే 19

వాజేడు మండల కేంద్రంలో భువనపల్లి సరిహద్దుల్లో చెరువు కూడిక పరిశీలించిన ఫీల్డ్ అసిస్టెంట్ అబ్బు శీను . ఉపాధి పనులు పని స్థలంలో కార్మికుల హాజరు మస్టర్ రూల్స్ ను నమోదు పట్టికను పరిశీలించడం జరిగింది. ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు , కొత్తగా ఎవరికైనా వంద రోజులు జాబు కార్డు కావాలంటే అప్లై చేసుకోవచ్చు అని ఆ యొక్క కూలీలకు వివరించడం జరిగింది అలాగే ఎవరికైన మరుగుదొడ్లు లేకపోతే కొత్త వాటికి అప్లై చేసుకోవచ్చు అని ఉపాధి హామీ కూలీలకు వివరించడం జరిగింది. ఉపాధి హామీ కూలీలకు పనుల గురించి నాణ్యత మరియు భద్రత చర్యలు గురించి కార్మికులకు వివరించడం జరిగింది. యొక్క పనులు ప్రభుత్వ నిబంధనల అనుకూలంగా జరుగుతున్నాయి. పనులు సమయానికి పూర్తి చేసుకొని ఎండ కాకముందే సమయానికి ఇంటికి వెళ్లాలని పలు సూచనలు ఇవ్వడం జరిగింది.

# హోతి(బీ) గ్రామంలో మహిళా అదృశ్యం

తెలంగాణ పత్రిక జహీరాబాద్(ప్రతినిధి),మే 19,



జహీరాబాద్ మండలము లోని హెతి (బీ) గ్రామము నందు నివాసం ఉంటున్న షరీఫా బేగం, గత ఆదివారం రోజునా అదృశ్యం అయినట్లు తన భర్త షాఖత్ అలీ జహీరాబాద్ రూరల్ పిఎస్ యందు దరఖాస్తు చేశారు. ఏం డీ. షౌకత్ అలి ఫిర్యాదు ప్రకారం అతని భార్య 16వ తేదీన ఆదివారం ఉదయం సుమారు 04గం. సమయంలో ఇంటినుండి ఎవ్వరికీ చెప్పకుండా బయటకి వెళ్లిపోయింది. తిరిగి ఇంటికి రాలేదు అని, పిర్యాది దారుడు తన భార్య గురించి బంధువుల వద్ద, స్నేహితుల వద్ద తెలిసిన వారి వద్ద అన్ని చోట్ల వెతికిన ఎక్కడ కూడా ఆచూకీ తెలియలేదని పేర్కొన్నారు. పిర్యాదు దారుడు తెలిపిన సమాచారం ప్రకారం,జహీరాబాద్ రూరల్ ఎస్.ఐ కాశీనాథ్ గారు ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరుగుతుంది అని అన్నారు.ఈ మహిళ ఆచూకీ తెలిసిన వారు ఈ క్రింది నెంబర్ లకు 9989238664, 8712656764, 8712656731 సమాచారం ఇవ్వగలరు అని జహీరాబాద్ రూరల్ ఎస్.ఐ తెలిపారు.

# లారీల సంఖ్యను మరింత పెంచాలి

**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశం.. ఐకేపీ కేంద్రం, రైస్ మిల్లులో కలెక్టర్, ఎస్పీ తనిఖీ**

ఇల్లంతకుంట మే 19 తెలంగాణ పత్రిక





కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపునకు ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు లారీల సంఖ్యను మరింత పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మంగళవారం ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్, ఎస్పీ మహేష్ బి. గితే, జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు.కేంద్రానికి ధాన్యం ఎంత వచ్చింది? ఇప్పటివరకు ఎంత కొనుగోలు చేశారో కలెక్టర్, ఎస్పీ ఆరా తీశారు. తరలింపునకు సిద్ధంగా ఉన్న ధాన్యం సంచుల కోసం మరిన్ని వాహనాలను సమకూర్చాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.రైస్ మిల్లులో తనిఖీ: అనంతరం ఇల్లంతకుంట మండలం చింతలకుంట పల్లె గ్రామంలోని శ్రీ లక్ష్మీసాయి రైస్ ఇండస్ట్రీస్‌లో కలెక్టర్, ఎస్పీ తనిఖీ చేశారు. ధాన్యం లక్ష్యం కేటాయింపు ఎంత? ఇప్పటి వరకు ఎంత అన్‌లోడ్ చేశారు? ఏ మండలాల నుంచి ధాన్యం వస్తుందో అడిగి తెలుసుకున్నారు. హమాలీల సంఖ్యను పెంచి అన్‌లోడింగ్ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీసీఎస్ఓ బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, డీసీఓ రామకృష్ణ, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ శశికళ తదితరులు పాల్గొన్నారు.

# వెల్దుర్తి వద్ద నిల్వకు అదనపు గోదాములు కేటాయింపు

**-వెల్దుర్తి మండల తాసిల్దార్ శ్రీనివాస్**

వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 19 (తెలంగాణ పత్రిక):





మెదక్ జిల్లా వెల్దుర్తి మండల రైతులకు ఊరటనిచ్చే విధంగా వడ్ల నిల్వ కోసం అదనపు గోదాములను అధికారులు కేటాయించారు. లక్ష్మీ రైస్ మిల్ వెల్దుర్తికి సంబంధించి నిన్న ఐకెపి వెల్దుర్తి గోదామును జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు కిరాయికి తీసుకున్నారు. ఈ గోదాంలోకి వెల్దుర్తి గ్రామంలోని కొనుగోలు కేంద్రాల నుంచి ట్రాక్టర్ల ద్వారా వడ్లను తరలిస్తే త్వరగా నిల్వ ప్రక్రియ పూర్తి కావడంతో పాటు కేంద్రాలు ఖాళీ అయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అదేవిధంగా తూప్రాన్ మండలం రామాయ పల్లిలోని మరో గోదామును కూడా వెల్దుర్తి మండలానికి చెందిన వడ్ల నిల్వ కోసం కేటాయించారు. దీంతో కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని వేగంగా తరలించే అవకాశం ఏర్పడిందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ నర్సింగ్ యాదవ్ పాల్గొన్నారు

## భార్యను అతి కిరాతకంగా నరికి చంపిన భర్త. పట్ట పగలు దారుణం

- హత్య తర్వాత నిందితుడు నేరుగా పోలీస్ స్టేషన్లో లొంగిపోయిన భర్త
- కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు



తెలంగాణ పత్రిక మే 19

హైదరాబాద్‌లో గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం (మే 19) పట్టపగలు దారుణ సంఘటన చోటుచేసుకుంది. కవాడిగూడలోని రత్నదీప్ బిల్డింగ్ నాలుగో అంతస్తు లో ఉన్న ఒక స్పా సెంటర్ లో పనిచేస్తున్న మహిళను ఆమె భర్తే కత్తితో పొడిచి అతి కిరాతకంగా హత్య చేశాడు. ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు స్పాట్‌కు చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతురాలు బహదూర్ పురా కిషన్ బాగ్ ప్రాంతానికి చెందిన బంగి దేబోరా అనే మహిళగా గుర్తించారు. ఆమె కవాడిగూడలోని స్పా సెంటర్‌లో బ్యూటీషియన్ గా విధులు నిర్వహిస్తోంది. గత కొంతకాలంగా దంపతుల మధ్య కుటుంబ కలహాలు నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కూడా భార్యా భర్తల మధ్య తీవ్రమైన గొడవ జరిగింది. ఆ గొడవ తర్వాత దేబోరా యథావిధి గా తనవిధులకు హాజరైంది. కోపంతో రగిలిపోయిన భర్త, తన వెంట కత్తిని సిద్ధం చేసుకుని స్పా సెంటర్‌కు చేరుకున్నాడు. మరోసారి ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. అక్కడ విచక్షణ రహితంగా దేబోరాపై దాడి చేసి, కత్తితో పొడిచాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డ మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఘాతుకానికి ఒడిగట్టిన అనంతరం నిందితుడు అక్కడి నుండి పరారయ్యాడు. సమాచారం అందుకున్న గాంధీనగర్ పోలీసులు, క్లూస్ టీంతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ప్రాథమికంగా మృతురాలి పేరు శ్వేత అని ప్రచారం జరిగినప్పటికీ, విచారణలో ఆమె పేరు బంగి దేబోరా అని స్పష్టమైంది. హత్య చేసిన తర్వాత నిందితుడు నేరుగా అత్తాపూర్ పోలీస్ స్టేషన్లో లొంగిపోయినట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశం కొరకు దరఖాస్తుల ఆహ్వానం...

- జ్యోతి, డిడి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ
- దరఖాస్తుల సమర్పణకు జూన్ 6 చివరి తేదీ..
- 1వ, 5వ తరగతుల్లో ప్రవేశం కొరకు ఖమ్మం జిల్లాలోని ఎస్సీ విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి..

తెలంగాణ పత్రిక మే 19

2026-27 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (రెసిడెన్షియల్,నాన్ రెసిడెన్షియల్) పాఠశాలల్లో 1వ తరగతి, 5వ తరగతుల్లో ప్రవేశం కొరకు జిల్లాకు చెందిన అర్హులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు జి.జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ నందు 1వ తరగతి (నాన్ రెసిడెన్షియల్ / డే స్కాలర్స్) లో 128 సీట్లు, 5వ తరగతి (రెసిడెన్షియల్) లో 131 సీట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి లక్షా 50 వేలు లోపు, పట్టణ ప్రాంతాల వారికి 2 లక్షల లోపు ఉండాలని, తల్లిదండ్రులు డిగ్రీ లేదా అంత కంటే ఎక్కువ చదువుకుని ఉంటే అనర్హులని స్పష్టం చేశారు. 1వ తరగతి ప్రవేశం కోరే విద్యార్థులు 2020 జూన్ 1 నుండి 2021 మే 31 మధ్య జన్మించి ఉండాలని (5 నుండి 6 సంవత్సరాల లోపు), ఒక కుటుంబం నుండి ఒకరికి మాత్రమే ప్రవేశానికి అర్హత ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ నూతన మార్గదర్శకాల ప్రకారం ఎస్సీ ఉపకులాల వారీగా (కేటగిరి-1 కు 1 శాతం, కేటగిరి-2 కు 9శాతం, కేటగిరి-3 కు 5 శాతం) సీట్లు కేటాయించబడతాయని వివరించారు. ఆసక్తి గల వారు దరఖాస్తు ఫారాలను మే 20 నుండి జూన్ 06 వరకు ఖమ్మం కలెక్టరేట్ (వెంకటాయపాలెం) లోని రూమ్ నెంబర్ ఎస్-34 లో గల షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకుల వారి కార్యాలయం నుండి పొంది, పూర్తి చేసిన దరఖాస్తులను తగిన ధృవీకరణ పత్రాలతో (మీ-సేవ ద్వారా పొందిన లేటెస్ట్ కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు, ఆధార్/రేషన్ కార్డు, మార్క్స్ మెమో లేదా బర్త్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు) జతపరిచి జూన్ 6వ తేదీ సాయంత్రం 5గంటల లోపు తిరిగి అదే కార్యాలయం లో సమర్పించాలని సూచించారు. ఇతర వివరాల కొరకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకుల (డిడి-ఎస్సీడిడి) కార్యాలయంలో సంప్రదించాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఎండ ప్రచండం జిల్లాలో నిప్పులు కక్కుతున్న భానుడు

- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనం
- జిల్లాలో 45 డిగ్రీలు దాటిపోతున్న ఉష్ణోగ్రతలు
- పెరుగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలతో జనం ఇబ్బందులు
- కర్కటక రేఖ ఎఫెక్ట్‌తో జిల్లాలో రికార్డుస్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతలు

తెలంగాణ పత్రిక మే 19:

జిల్లాలో భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. మంట రేపుతున్న ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గత వారం రోజుల క్రితం కొద్దిపాటి వర్షాలతో శాంతించిన భానుడు మళ్లీ నిప్పులు కక్కుతున్నాడు. ఈసారి వేసవిలో జిల్లాలో రికార్డుస్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటగా శనివారం 45.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. భూతాపం, ఎల్‌నినో ప్రభావం, బలమైన సౌరవికిరణం వల్ల జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల నుంచి 46 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. పసిఫిక్ మహాసముద్రం ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడంతో ఏర్పడిన ఎల్‌నినో ప్రభావం జిల్లా కర్కాటక రేఖకు సమీపంగా ఉండడంతో రికార్డుస్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. భౌగోళికంగా జిల్లా దక్కన్ పీఠభూమి ప్రాంతంలో ఉండడం వల్ల వేసవిలో భూమి వేడిని ఎక్కువగా గ్రహిస్తోంది. జిల్లా సముద్ర తీరానికి దూరంగా ఉండడంతో చల్లని గాలుల ప్రభావం తక్కువగా ఉండడంతో ఎండ తీవ్రత ఎక్కువవుతోంది. జిల్లాలో గత కొన్నేళ్లుగా చెట్లు తగ్గడం, పట్టణీకరణ పెరగడంతో దాని ప్రభావంతో చల్లదనం తగ్గిపోతుంది. వాతావరణశాఖ గణాంకాల ప్రకారం గత వారం రోజుల్లో జిల్లాలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు పదేళ్లలో వేడిగాలుల తీవ్రత గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది.

**నేరుగా పడుతున్న సూర్యకిరణాలు**

కర్కాటక రేఖకు తెలంగాణ సమీపంలో ఉండడంతో వేసవిలో సూర్యకిరణాలు దాదాపుగా నిటారుగా భూమిపై పడుతున్నాయి. రాష్ట్రంలో 15 నుంచి 19 ఉత్తర అక్షాంశాల మధ్య ఉండడంతో ఏప్రిల్, మే నెలల్లో సూర్య కిరణాల ప్రభావం అధికమవుతోంది. ఫలితంగా భూమి ఉపరితలం వేడిని వేగంగా గ్రహించి మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరుగుతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న వాతావరణ మార్పులతో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. మహారాష్ట్ర, ఉత్తర తెలంగాణ ప్రాంతాల నుంచి వచ్చే పొడివేడి గాలుల ప్రభావం జిల్లాపై తీవ్రత చూపుతున్నట్లు వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.

**యేడాదికేడాది పెరుగుతున్న వేడి**

వాతావరణశాఖ అధికారుల లెక్కల ప్రకారం ప్రతీ యేడాది జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. 1990లో జిల్లాలో వేసవి సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 39 డిగ్రీలుగా ఉండగా ప్రస్తుతం సగటు ఉష్ణోగ్రత 40.5 డిగ్రీల నుంచి 41 డిగ్రీల మధ్య నమోదవుతోంది. గతమూడు దశాబ్దాలలో సగటు ఉష్ణోగ్రత దాదాపు 1 నుంచి 1.5 డిగ్రీలకు పెరిగింది. గతంలో సంవత్సరానికి 5 నుంచి 10 లోపు వేడిగాలులు నమోదయ్యేవి. ఇప్పుడు అవి 15 నుంచి 20 వరకు నమోదవుతున్నాయంటే జిల్లాలో వేడి తీవ్రత రోజురోజుకు పెరుగుతుందనేది స్పష్టమవుతోంది.

**తగ్గుతున్న పచ్చదనం**

జిల్లాలో పట్టణీకరణ వేగంగా పెరుగుతుండడంతో అడవుల విస్తీర్ణం తగ్గడం, చెట్లు నరికివేత, కాంక్రీట్ నిర్మాణాల వల్ల చెట్ల సంఖ్య తగ్గిపోతోంది. నగర ప్రాంతాల్లో రోడ్లు, భవనాలు కాంక్రీట్ నిర్మాణాలతో వేడి ఎక్కువ సేపు నిల్వ ఉంటుంది. దీన్ని వాతావరణ శాఖ అధికారులు హీట్ ఐలాండ్ ఎఫెక్ట్‌గా ధృవీకరిస్తున్నారు. సిమెంట్ నిర్మాణాలు పగటిపూట వేడిని గ్రహించి రాత్రి విడుదల చేయడంతో రాత్రి పూట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీల కంటే తక్కువగా నమోదు కావడంలేదు. దీంతో ఉక్కపోతతో జనం ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9గంటల నుంచే వేడి గాలుల ప్రభావంతో ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు.

**భవిష్యత్తు పై ప్రభావం**

వాతావరణ మార్పుల ప్రభావం ఇలానే కొనసాగితే 2035 నాటికి తెలంగాణలో వేసవి గరిష్ఠ ఉష్ణోగ్రతలు మరో 1 నుంచి 2 డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అటవీ విస్తీర్ణం తగ్గడం, అవసరాల కోసం చెట్లను నరికివేయడం వంటి కారణాల వల్ల పచ్చదనం తగ్గిపోతుంది. చెరువులు, కుంటలు సైతం ఎండిపోవడంతో నీటి లభ్యత తగ్గి వాతావరణంలో చల్లదనం తగ్గుతుంది. భూగర్భ జలాల మట్టం తగ్గి దీని ప్రభావం వేడి తీవ్రతను పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు. చెరువుల పునరుద్ధరణ, మొక్కల పెంపకం, పట్టణాల్లో హరితవనాల అభివృద్ధి కార్యక్రమాలు చేయడంతో కొంతమేరకైనా వాతావరణ పరిస్థితులను తగ్గించే అవకాశాలు ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు.

# తెలంగాణ అధికారి 100 కోట్ల అవినీతి ఇది రికార్డు లకే రికార్డు.

- కళ్ళు చెదిరే నగదు అంతకు మించిన స్థాయిలో బంగారం
- వెండి అయితే కిలోల్లో? ప్లాట్లు లెక్కకు మిక్కిలి
- ఏసీబీ అధికారులు సికింద్రాబాద్ లో మెరుపు దాడులు

తెలంగాణ పత్రిక మే 19

ఖరీదైన గడియారాలు అంతకుమించి కరెన్సీ ని లెక్కించి యంత్రాలు పనిచేయకుండా ఆగిపోయాయి. బంగారాన్ని తూకం వేస్తుంటే అధికారుల బుర్రలు బద్దలైపోయాయి. అక్రమ ఆస్తుల వివరాలను లెక్కిస్తుంటే సిబ్బందికి ఊపిరి ఆగినంత పని అయిపోయింది. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా వందల కోట్ల ఆస్తులను వెనకేశాడు. అవన్నీ కూడా అక్రమంగా సంపాదించాడు. చివరికి ఏసీబీ అధికారుల తనిఖీలో దొరికిపోయాడు. తెలంగాణ ఏసీబీ అధికారులు సికింద్రాబాద్ లో మెరుపు దాడులు మొదలుపెట్టారు. మంగళవారం ఉదయం నుంచి ఈ తనిఖీలు మొదలయ్యాయి. హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై బోర్డు రెడ్ హిల్స్ డివిజన్ జనరల్ మేనేజర్ కుమార్ ఇంట్లో ఏసీబీ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఆయన నివాసం ఉంటున్న మల్లాపూర్ లోని వెంకటరమణ కాలనీలో తనిఖీలు మొదలు పెట్టిన అధికారులు 1.05 లిక్విడ్ క్యాష్ సీజ్ చేశారు. ఒక దశలో కరెన్సీ కట్టలను లెక్కించే క్రమంలో యంత్రాలు మొరాయించినట్లు తెలుస్తోంది. కేజీ బంగారు ఆభరణాలు ఇతర ఆస్తి పత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కుమార్ పేరు మీద నిజామాబాద్ ప్రాంతంలో మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. బహిరంగ మార్కెట్లో దీని విలువ ఎక్కువగా ఉంటుంది. ఇది మాత్రమే కాకుండా ఇంకా అనేక ఆస్తులను అధికారులు గుర్తించారు. హైదరాబాద్ నగరంలో అత్యంత ఖరీదైన ప్రాంతాలలో 9 విలాసవంతమైన ప్లాట్లు ఉన్నాయి. బంగారం, భూములు, ఇతర ఆస్తులను



లెక్కిస్తే వాటి విలువ 100 కోట్లుగా తేలింది. కుమార్ నివాసంతో పాటు పలుచోట్ల అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కుమార్ మీద అధికారులకు చాలా ఫిర్యాదులు అందాయి. కొద్దిరోజులుగా కుమార్ మీద ఏసీబీ అధికారులు దృష్టి పెట్టారు. ఆయన మీద వచ్చిన ఆరోపణలను రూఢీ చేసుకున్నారు. అనేక ఆధారాలు సేకరించిన తర్వాత మంగళవారం మెరుపు దాడులు మొదలు పెట్టారు. ఉదయం నుంచి ఇప్పటివరకు అధికారులు తనిఖీలు చేస్తూనే ఉన్నారు. మెట్రో వాటర్ సప్లై బోర్డులో కుమార్ కొంతకాలంగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వానికి చెందాల్సిన సొమ్మును తన జేబులో వేసుకుంటున్నారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ కిందిస్థాయి సిబ్బందికి మాత్రమే కాదు. పై స్థాయి అధికారులకు కూడా తలనొప్పిగా మారిపోయారు. దీంతో ఇన్ని రోజులకు కుమార్ అవినీతి బాగోతం బయటపడింది.

# కొనుగోలు చేసిన వరి ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలి

- మిల్లులకు ధాన్యంతో వచ్చిన లారీలను త్వరగా అన్లోడ్ చేసి పంపించాలి
- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

తెలంగాణ పత్రిక మే 19:

జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలనే ఉదేశ్యంతో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం పెగడపెల్లి మండలం నంచర్ల, దేవి కొండ, రాం నగర్ గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎండపెల్లి మండల కేంద్రంలోని వాయుపుత్ర రైస్ మిల్ మరియు గుల్ల కోట గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ మరియు రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకొని పాడీని ప్రొటెక్ట్ చేయాలని అన్నారు. వరి ధాన్యం కొనుగోలు, నిల్వలు మరియు మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు



కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. రైస్ మిల్లులలో ధాన్యం నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియ, లోడింగ్ మరియు అన్‌లోడింగ్ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులను, మిల్లర్లను వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిల్లుల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, సివిల్ సప్లై అధికారి జితేందర్ రెడ్డి, తహసీల్దార్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

### ఐటీ షేర్ల జోరు: ఆరు శాతం వరకు జంప్..

- నిఫ్టీ ఐటీ ఇండెక్స్ దాదాపు 4% జంప్
- కోఫోర్జ్ షేరు 6 శాతం మేర పెరుగుదల
- రూపాయి విలువ పడిపోవడం ఐటీ కంపెనీలకు లాభం
- తక్కువ ధర వద్ద కొనుగోళ్లకు ఇన్వెస్టర్ల మొగ్గు




గత కొన్ని వారాలుగా తీవ్ర నష్టాల్లో ఉన్న భారత ఐటీ రంగ షేర్లు మంగళవారం ఒక్కసారిగా పుంజుకున్నాయి. కోఫోర్జ్, ఎంఫసిస్, పర్సిస్టెంట్ సిస్టమ్స్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి ప్రముఖ ఐటీ కంపెనీల షేర్లు కొనుగోళ్ల మద్దతుతో ఆరు శాతం వరకు లాభపడ్డాయి. దీంతో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ దాదాపు నాలుగు శాతం మేర ముందంజ వేసింది. కోఫోర్జ్ అత్యధికంగా ఆరు శాతం పెరగ్గా.. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, పర్సిస్టెంట్ సిస్టమ్స్ షేర్లు 4 నుంచి 5 శాతం వరకు లాభపడ్డాయి. గత కొన్ని నెలలుగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ వల్ల సాంప్రదాయ సాఫ్ట్‌వేర్, కోడింగ్ ఉద్యోగాలకు ముప్పు వస్తుందనే భయాలు మార్కెట్‌ను కమ్మేశాయి. ఇటీవలే ఓపెన్‌ఏఐ, ఆంత్రోపిక్ సంస్థలు విడుదల చేసిన సరికొత్త ఏఐ ఏజెంట్ల వల్ల ఐటీ కంపెనీల ఔట్‌సోర్సింగ్ బిజినెస్ దెబ్బతింటుందనే ఆందోళనలతో ఐటీ షేర్లు భారీగా పతనమయ్యాయి. వాల్యుయేషన్లు 2008 నాటి సంక్షోభం స్థాయికి పడిపోయాయి. దీంతో ఇన్వెస్టర్లు ఇప్పుడు తక్కువ ధరకు లభిస్తున్న నాణ్యమైన ఐటీ షేర్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపించారు.

## యూపీఐ చెల్లింపుల కోసం ఇక పేరెంట్స్ ఫోన్ అక్కర్లేదు..

# పేటీఎం 'పాకెట్ మనీ' వచ్చేసింది!

డిజిటల్ చెల్లింపుల దిగ్గజం పేటీఎం, టీనేజర్లను లక్ష్యంగా చేసుకుని మరో కీలకమైన ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. 'పేటీఎం పాకెట్ మనీ' పేరుతో నేడు ప్రారంభించిన ఈ కొత్త సదుపాయం ద్వారా బ్యాంకు ఖాతా లేని టీనేజర్లు కూడా నేరుగా యూపీఐ చెల్లింపులు చేసేందుకు అవకాశం కలుగుతుంది. నగదు కోసం లేదా చెల్లింపులు పూర్తి చేయడానికి తల్లిదండ్రులపై ఆధారపడాల్సిన అవసరం ఉందని కంపెనీ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమర్పించిన ప్రకటనలో తెలిపింది. ఈ ఫీచర్ ద్వారా తల్లిదండ్రులు లేదా కుటుంబ సభ్యులు తమ పిల్లల నెలవారీ ఖర్చులకు పరిమితి విధించవచ్చు. అంతేగాక వారు చేసే యూపీఐ లావాదేవీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించవచ్చు. "పేటీఎం స్పెండ్ సమ్మరీతో కుటుంబాలు తమ పిల్లల ఖర్చుల సరళిని సమీక్షించుకోవచ్చు. వారికి ఇచ్చే పాకెట్ మనీని మెరుగ్గా నిర్వహించడంతో పాటు సురక్షితమైన, బాధ్యతాయుతమైన అలవాట్లను చిన్నతనం నుంచే నేర్పించవచ్చు" అని పేటీఎం ఒక ప్రకటనలో పేర్కొంది. పాఠశాల, కళాశాల క్యాంటీన్లు, మెట్రో రైళ్లు, క్యాబ్‌లు, మొబైల్ రీఛార్జ్‌లు, షాపింగ్ వంటి రోజువారీ అవసరాలకు ఈ ఫీచర్ టీనేజర్లకు ఎంతగానో ఉపయోగపడుతుంది.




**'పేటీఎం పాకెట్ మనీ' ఎలా పనిచేస్తుంది?**

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) 2024 ఆగస్టులో ప్రవేశపెట్టిన 'యూపీఐ సర్కిల్' ఫీచర్ ఆధారంగా ఈ సేవ పనిచేస్తుంది. యూపీఐ సర్కిల్ ద్వారా బ్యాంకు ఖాతా కలిగిన ప్రాథమిక యూజర్ (తల్లి/తండ్రి), తమ కుటుంబ సభ్యులను లేదా నమ్మకమైన వారిని సెకండరీ యూజర్‌గా చేర్చుకోవచ్చు. దీనివల్ల ఒకే బ్యాంకు ఖాతాకు సంబంధించిన యూపీఐ ఐడీని ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది ఉపయోగించుకోవచ్చు. అయితే, లావాదేవీలపై పూర్తి నియంత్రణ, పరిమితులు విధించే అధికారం ప్రాథమిక యూజర్‌కే ఉంటుంది. ఒకసారి యాక్టివేట్ అయిన తర్వాత టీనేజర్లు తమ సొంత మొబైల్ ఫోన్‌లోని పేటీఎం యాప్ ద్వారా సురక్షితంగా యూపీఐ చెల్లింపులు చేయవచ్చు. "ఇకపై టీనేజర్లు చెల్లింపుల కోసం తమ తల్లిదండ్రుల ఫోన్ తీసుకోవడం, ఓటీపీల కోసం అడగడం లేదా క్యూఆర్ కోడ్‌ను వాట్సాప్‌లో పంపడం వంటివి చేయాల్సిన అవసరం లేదు" అని కంపెనీ పేర్కొంది.

**పరిమితులు.. భద్రతా నియంత్రణలు**

తల్లిదండ్రులు తమ పిల్లల కోసం ఈ పాకెట్ మనీని సెటప్ చేసేటప్పుడు, లావాదేవీలపై పరిమితులు విధించవచ్చు. ప్రతి లావాదేవీ గరిష్ఠంగా రూ. 5,000, నెలవారీ మొత్తం ఖర్చు రూ. 15,000 మించకుండా పరిమితి ఉంటుంది. భద్రతను దృష్టిలో ఉంచుకుని, ఫీచర్ సెటప్ చేసిన మొదటి 30 నిమిషాల్లో రూ. 500, మొదటి 24 గంటల్లో రూ. 5,000 వరకు మాత్రమే చెల్లింపులు చేయగలరు. ఈ ఫీచర్ వాడటానికి డివైస్ లాక్ తప్పనిసరి. తల్లిదండ్రులు తమ పేటీఎం యూపీఐ పిన్ ఉపయోగించి ఎప్పుడైనా ఈ పరిమితులను మార్చవచ్చు లేదా యాక్సెస్‌ను తక్షణమే రద్దు చేయవచ్చు.

## భారత్‌లో బీబీఎల్ మ్యాచ్‌లు.. క్రికెట్ లవర్స్ కు పండగే!




ఆస్ట్రేలియాకు చెందిన ప్రఖ్యాత టీ20 లీగ్, బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్) మ్యాచ్‌ను భారత్‌లో నిర్వహించేందుకు సన్నాహాలు వేగవంతమయ్యాయి. ఈ ఏడాది డిసెంబర్‌లో చెన్నైలోని ఎంఏ చిదంబరం (చెపాక్) స్టేడియంలో బీబీఎల్ 2026-27 సీజన్‌కు చెందిన ఒక మ్యాచ్‌ను నిర్వహించే ప్రతిపాదనపై బీసీసీఐ, క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ), తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ (టీఎన్‌సీఏ) మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయి. ఈ మూడు సంస్థల మధ్య అధికారిక ఒప్పందం ఇంకా ఖరారు కానప్పటికీ, మిగిలిన ప్రక్రియలన్నీ కేవలం పరిపాలనాపరమైనవేనని సంబంధిత అధికారులు భావిస్తున్నారు. భారత్, ఆస్ట్రేలియా ప్రభుత్వాల మధ్య క్రీడా సహకార కార్యక్రమాల్లో భాగంగా ఈ ప్రతిపాదనకు ఇరు దేశాల ప్రభుత్వాల మద్దతు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు 'క్రిక్‌బజ్' ఒక కథనాన్ని ప్రచురించింది. క్రిక్‌బజ్ కథనం ప్రకారం, ఇటీవల క్రికెట్ ఆస్ట్రేలియా, బీబీఎల్ ప్రతినిధుల బృందం చెన్నైలో పర్యటించి చెపాక్ స్టేడియంలోని సౌకర్యాలను పరిశీలించింది. ఈ మ్యాచ్‌ను డిసెంబర్ రెండో లేదా మూడో వారంలో నిర్వహించే అవకాశం ఉంది. "ఇంకొన్ని వారాల్లో క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి స్పష్టత వస్తుంది. వారి సభ్యులు ఐపీఎల్ మ్యాచ్‌కు హాజరయ్యారు. పూర్తి సమాచారంతో మళ్లీ సంప్రదిస్తామని చెప్పారు" అని టీఎన్‌సీఏ అధికారి ఒకరు తెలిపినట్టు ఆ కథనం పేర్కొంది. సోమవారం చెన్నైలో జరిగిన ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మిన్హాస్, తాత్కాలిక సీఈఓ హేమాంగ్ అమిన్ కూడా సీఏ ప్రతినిధులతో చర్చల్లో పాల్గొన్నారు. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే, భారత గడ్డపై ఒక విదేశీ ఫ్రాంచైజీ టీ20 లీగ్ మ్యాచ్ జరగడం ఇదే తొలిసారి అవుతుంది. ఇది భవిష్యత్తులో మరిన్ని క్రాస్-లీగ్ సహకారాలకు మార్గం సుగమం చేస్తుందని భావిస్తున్నారు.

## ఆఫ్ఘనిస్థాన్ సిరీస్‌కు భారత జట్టు ప్రకటన.. గిల్‌కు కెప్టెన్సీ, కొత్త ముఖాలకు చోటు!



జూన్ 6 నుంచి ఆఫ్ఘనిస్థాన్ తో జరగబోయే ఏకైక టెస్ట్ మ్యాచ్, మూడు వన్డేల సిరీస్ కోసం బీసీసీఐ భారత జట్టును ప్రకటించింది. ఈ టూర్‌లో టెస్ట్‌తో పాటు వన్డే జట్టుకు కెప్టెన్‌గా యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ వ్యవహరించనున్నాడు. టెస్ట్‌కు వైస్ కెప్టెన్ బాధ్యతలను కేఎల్ రాహుల్‌కు అప్పగించారు. ఆంధ్రా క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి టెస్టు, వన్డే జట్లకు రెండింటికీ ఎంపికయ్యాడు. వన్డే జట్టులోకి శ్రేయస్ అయ్యర్ తిరిగి రావడమే కాకుండా వైస్ కెప్టెన్ బాధ్యతలనూ దక్కించుకున్నాడు. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీని వన్డే జట్టుకు ఎంపిక చేశారు. అయితే రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా ఎంపిక వారి ఫిట్‌నెస్ ఆధారంగానే ఖరారవుతుందని సెలెక్టర్లు స్పష్టం చేశారు. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతి కల్పించారు. ఈ సిరీస్ ద్వారా హర్ష్ దూబే, గుర్నూర్ బ్రార్ టెస్టులు, వన్డేల్లో అరంగేట్రం చేయనుండగా.. ప్రిన్స్ యాదవ్ వన్డేల్లో అరంగేట్రం చేయనున్నాడు. మానవ్ సుతార్ టెస్టుల్లో అరంగేట్రం చేయనున్నాడు.

**వన్డే జట్టు:**


శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ (ఫిట్‌నెస్ ఆధారంగా), విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్, నితీశ్ కుమార్ రెడ్డి, హార్దిక్ పాండ్యా (ఫిట్‌నెస్ ఆధారంగా), ప్రిన్స్ యాదవ్, హర్ష్ దూబే, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, గుర్నూర్ బ్రార్

**టెస్ట్ జట్టు:**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), రిషభ్ పంత్ (వికెట్ కీపర్), సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, నితీశ్ కుమార్ రెడ్డి, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, మహ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, మానవ్ సుతార్, హర్ష్ దూబే, గుర్నూర్ బ్రార్.

## స్పోర్ట్స్

### ధోనీ రిటైర్మెంట్ హింట్ ఇచ్చారా? రైనా వెల్లడించిన ఆసక్తికర విషయం




చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) దిగ్గజం ఎం.ఎస్ ధోనీ ఐపీఎల్ భవిష్యత్తుపై సస్పెన్స్ ఇంకా కొనసాగుతూనే ఉంది. అయితే ఆయన వచ్చే సీజన్‌లోనూ ఆడాలని సీఎస్‌కే మాజీ స్టార్ సురేష్ రైనా ఆకాంక్షించాడు. చెపాక్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై ఓటమి తర్వాత 'స్టార్ స్పోర్ట్స్'తో రైనా మాట్లాడాడు. ఈ సందర్భంగా ధోనీ రిటైర్మెంట్ పై వారిద్దరి మధ్య జరిగిన ఒక సంభాషణను పంచుకున్నాడు. "నేను ధోనీతో మాట్లాడాను. నువ్వు ఐపీఎల్ 2026 సీజన్‌కు కేవలం మిస్డ్‌కాల్ ఇచ్చావంతే. ఇది లెక్కలోకి రాదు. వచ్చే ఏడాది కచ్చితంగా ఆడాల్సిందేనని నేను అతడితో అన్నాను" అని రైనా వెల్లడించాడు. దానికి ధోనీ స్పందిస్తూ.. "నా శరీరం కొంచెం బలహీనంగా అనిపిస్తోంది" అన్నాడని రైనా తెలిపాడు. అయితే "మేం అవేమీ నమ్మం. నువ్వు వచ్చే ఏడాది ఆడాల్సిందేనని నేను స్పష్టం చేశాను" అని రైనా వెల్లడించాడు. ఇది ధోనీ వ్యక్తిగత నిర్ణయమైనప్పటికీ అతను మాత్రం పాజిటివ్‌గానే ఉన్నట్లు తనకు అనిపించిందని తెలిపాడు. ధోనీ ఈ సీజన్ మొత్తం తుది జట్టులో లేడు. కనీసం స్టేడియంలో కూడా కనిపించలేదు. కానీ నిన్న అతణ్ని చెపాక్‌లో చూసి ఫ్యాన్స్ భావోద్వేగానికి గురయ్యారు. టీమ్ ఫొటోగ్రాఫ్ కోసం మైదానంలోకి రాగానే స్టేడియం దద్దరిల్లింది. ఎలాంటి స్పీచ్ ఇవ్వకుండానే, బౌండరీ లైన్ వెంట నడుస్తూ అభిమానులకు అభివాదం చేశాడు. 44 ఏళ్ల ధోనీ చెపాక్ హోమ్ గ్రౌండ్‌లో కనిపించడం ఇదే చివరిసారి కావచ్చనే బాధతో ఫ్యాన్స్ భావోద్వేగంతో నినాదాలు చేశారు. మరోవైపు రైనాతో ధోనీ వ్యాఖ్యలు, చెపాక్‌లో కనిపించి అభివాదం చేయడం ఆయన రిటైర్మెంట్ హింట్ అయ్యుండొచ్చని పలువురు విశ్లేషిస్తున్నారు.

# సినిమా అనేది ఉద్యోగం కాదు.. ఒక లైఫ్ స్టైల్: రానా

- సినిమా అనేది ఉదయం వెళ్లి సాయంత్రం వచ్చే ఉద్యోగం కాదన్న రానా
- ఇండస్ట్రీ అనేది వస్తువులను తయారు చేసే ఫ్యాక్టరీ కాదని వ్యాఖ్య
- వరుసగా 15 గంటలు పని చేసినా ఆశించిన స్థాయిలో సీన్ రాకపోవచ్చన్న రానా



టాలీవుడ్ నటుడు దగ్గుబాటి రానా ఒకవైపు వైవిధ్యమైన పాత్రల్లో నటిస్తూ, మరోవైపు నిర్మాతగా కూడా క్రేజీ ప్రాజెక్ట్‌లను పట్టాలెక్కిస్తూ చిత్ర పరిశ్రమలో తన ప్రత్యేక ముద్రను చాటుకుంటున్నారు. ఇటీవల 'కాంత' అనే డిఫరెంట్ కంటెంట్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన రానా, నటుడిగా మంచి మార్కులు కొట్టేసినా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయి కమర్షియల్ సక్సెస్ అందుకోలేకపోయారు. మరోవైపు, చలనచిత్ర పరిశ్రమ పనితీరు, షూటింగ్స్ సమయంలో పడే కష్టం గురించి రానా చేసిన ఆసక్తికరమైన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. "సినిమా అనేది కేవలం ఉదయం వెళ్లి సాయంత్రం వచ్చే ఉద్యోగం లాంటిది కాదు, అది ఒక లైఫ్‌స్టైల్. ఆ జీవనశైలిలో మీరు కొనసాగాలా వద్దా అనేది పూర్తిగా మీ ఇష్టంపై మాత్రమే ఆధారపడి ఉంటుంది. ఇక్కడ ప్రతి సినిమా కూడా మేకర్స్ నుంచి, నటీనటుల నుంచి ఇంకేదో ఒక కొత్త విషయాన్ని ఆశిస్తూనే ఉంటుంది. కేవలం ఎనిమిది గంటలు డ్యూటీ చేస్తే ఒక అత్యుత్తమమైన సన్నివేశం వచ్చేస్తుందని అనుకోవడానికి ఇదేమీ వస్తువులను తయారుచేసే ఫ్యాక్టరీ కాదు" అని రానా స్పష్టం చేశారు. సినిమా మేకింగ్ వెనుక ఉండే అంకితభావాన్ని వివరిస్తూ.. "కొన్నిసార్లు మనం సెట్స్‌పై వరుసగా 15 గంటల పాటు ఎంతో కష్టపడి షూటింగ్ చేసినా కూడా, ఆశించిన స్థాయిలో ఒక్క మంచి సీన్ కూడా రాకపోవచ్చు. సినిమా అనేది పూర్తిగా మనం చేసే ప్రాజెక్ట్‌ను బట్టి, అందులోని సిచ్యుయేషన్లను బట్టి మారుతూ ఉంటుంది" అని రానా చెప్పుకొచ్చారు. కేవలం గంటల లెక్కన కాకుండా, క్రియేటివిటీ కోసం ఎంతటి శ్రమనైనా ఓర్చడమే సినిమా రంగం ప్రత్యేకత అని ఆయన విశ్లేషించారు.

# ఇళయరాజాకు 'కరుప్పు' టీమ్ క్షమాపణ

- సూర్య, త్రిష జంటగా నటించిన 'కరుప్పు' సినిమా
- సినిమాలో ఇళయరాజాను ఉద్దేశిస్తూ కొన్ని డైలాగులు
- ఇళయరాజాను అగౌరవపరచడం తమ ఉద్దేశం కాదన్న చిత్ర యూనిట్



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, అగ్ర నటి త్రిష జంటగా నటించిన తాజా చిత్రం 'కరుప్పు' (తెలుగులో 'వీరభద్రుడు'). టాలెంటెడ్ డైరెక్టర్ ఆర్ జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో భారీ కలెక్షన్లతో, హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. హీరో సూర్య కెరీర్‌లో ఇదొక పవర్‌ఫుల్ కమ్ బ్యాక్ హిట్‌గా నిలిచింది. అయితే, ఒకవైపు బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధిస్తున్నప్పటికీ.. మరోవైపు ఈ చిత్రంలోని కొన్ని డైలాగులు ఇప్పుడు పెద్ద వివాదానికి దారితీశాయి. ఈ చిత్రంలో భారతీయ సంగీత ప్రపంచంలోనే లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్‌గా పేరొందిన ఇళయరాజాను ఉద్దేశిస్తూ కొన్ని డైలాగ్స్ ఉన్నాయి. ఆ డైలాగులు ఆయన స్థాయిని, గౌరవాన్ని తగ్గించేలా ఉన్నాయంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు, ఆయన అభిమానులు చిత్ర బృందంపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. వివాదం ముదురుతుండటంతో 'కరుప్పు' మూవీ టీమ్ స్పందించింది. ఇళయరాజాకు క్షమాపణలు చెబుతూ ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఇళయరాజాపై తమకు ఎంతో గౌరవం ఉందని, భారతీయ సినీ రంగానికి ఆయన చేసిన సేవలు... ఎందరో నటీనటులకు, సాంకేతిక నిపుణులకు ఎన్నో తరాలుగా స్ఫూర్తిని నింపుతూనే ఉన్నాయని చిత్ర బృందం పేర్కొంది. సినిమాలో ఆయనను ఉద్దేశిస్తూ ఉన్న ఒక డైలాగ్ వల్ల ఆయన బాధ పడ్డారనే విషయం తమ దృష్టికి వచ్చిందని, అందువల్ల తాము ఇళయరాజాను మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నామని తెలిపారు. ఆయనను అగౌరవపరచడం తమ ఉద్దేశం ఎంతమాత్రం కాదని స్పష్టం చేశారు. వివాదానికి కారణమైన ఆ నిర్దిష్ట సీన్లను, డైలాగులను సినిమాలోంచి పూర్తిగా తొలగిస్తున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. థియేటర్లలో ఈ రోజు నుంచే ఆ మార్పులు అమలులోకి వస్తాయని వెల్లడించారు. చలనచిత్ర పరిశ్రమలో అందరి గౌరవమే తమకు ప్రధానమని.. కాబట్టి, దయచేసి ఈ విషయాన్ని ఇంతటితో ముగించాలని కోరారు. దీనిని మరింత కాంట్రవర్సీగా మార్చి సోషల్ మీడియాలో ఎలాంటి తప్పుడు వార్తలను, ఊహాగానాలను సృష్టించవద్దని వారు వేడుకున్నారు.

# 'బ్యాడ్ బాయ్ కార్తీక్' (అమెజాన్ ప్రైమ్) మూవీ రివ్యూ




తెలుగు తెరపై హ్యాండ్ సమ్ కటౌట్ గా కనిపించే హీరోలలో నాగశౌర్య ఒకరు. ఆరంభంలోనే వరుస విజయాలను అందుకుంటూ వచ్చిన నాగశౌర్య, ఆ తరువాత లవర్ బాయ్ ఇమేజ్ నుంచి బయటకి రావడం కోసం, యాక్షన్ పాళ్లు ఎక్కువగా ఉన్న కథలను ఎంచుకుంటూ వచ్చాడు. అలా ఆయన చేసిన సినిమానే 'బ్యాడ్ బాయ్ కార్తీక్'. ఏప్రిల్ 17వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఈ నెల 15వ తేదీ నుంచి అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ అవుతోంది. కార్తీక్ (నాగశౌర్య) తన అక్కయ్య కస్తూరి (శ్రీదేవి విజయ్ కుమార్) ... బావ వాసు (అజయ్)తో కలిసి 'వైజాగ్' లో నివసిస్తూ ఉంటాడు. శ్రీదేవి అడ్వకేట్ గా పనిచేస్తూ ఉంటుంది. అదే వైజాగ్ లో సాయి విక్రమ్ (సాయి కుమార్) పోలీస్ ఆఫీసర్ గా ఉంటాడు. ఆయన కూతురు 'మహా' (విధి యాదవ్)ను కార్తీక్ ఇష్టపడుతూ ఉంటాడు. బీటెక్ పూర్తిచేసిన కార్తీక్, ఊళ్లో అల్లర చిల్లరగా తిరుగుతూ ఉండటంతో, అతణ్ణి పై చదువుల కోసం ఫారిన్ పంపించాలనే ఆలోచనలో కస్తూరి ఉంటుంది. 'కదిరి'లో వరదారెడ్డి (సముద్రఖని) గోవిందప్ప (మైమ్ గోపీ) మధ్య ఫ్యాక్షన్ గొడవలు నడుస్తూ ఉంటాయి. వరదారెడ్డి చెల్లెలు గోవిందప్ప అన్నయ్య మునెప్పను ప్రేమిస్తుంది. ఈ విషయం తెలుసుకున్న వరదారెడ్డి, తన వాళ్లతో మునెప్పను చంపిస్తాడు. అప్పటి నుంచి వరదారెడ్డిపై ప్రతీకారంతో గోవిందప్ప రగిలిపోతుంటాడు. సరైన సమయం కోసం అతను వెయిట్ చేస్తూ ఉంటాడు. ఈ నేపథ్యంలోనే తన అక్కయ్య కస్తూరిని హత్య చేయించడానికి గోవిందప్ప ప్రయత్నిస్తున్న విషయం కార్తీక్ కి తెలుస్తుంది. అందుకు గల కారణం ఏమిటనేది తెలుసుకోవడం కోసం, కార్తీక్ వైజాగ్ నుంచి కదిరి వెళతాడు. అక్కడ ఏం జరుగుతుంది? కస్తూరి పై గోవిందప్పకి గల కోపానికి కారణం ఏమిటి? వరదారెడ్డితో ముడిపడిన ఆ అక్కాతమ్ముళ్ల గతం ఎలాంటిది? అనేది కథ.

ఈ కథ వైజాగ్ - కదిరి మధ్య జరుగుతుంది. ఇది అక్కాతమ్ముళ్ల ఎమోషన్స్ కి సంబంధించిన కథ. ఈ రెండు పాత్రలతో పాటు అంతే ప్రధానమైనవిగా వరదారెడ్డి - గోవిందప్ప పాత్రలు కనిపిస్తాయి. ఈ నాలుగు పాత్రలను ప్రధానంగా చేసుకునే ఈ కథ ముందుకు వెళుతూ ఉంటుంది. ఇక ఆ తరువాత స్థానంలో సాయికుమార్ .. అతని కూతురు మహా (హీరోయిన్) పాత్రలు ముఖ్యమైనవిగా దర్శకుడు ఈ కథను అల్లుకుంటూ వెళ్లాడు. ఒక వైపున వైజాగ్ లో తమ్ముడు గురించి అక్క ఆందోళన చెందుతూ ఉంటుంది. మరో వైపున కదిరిలో విలన్స్ మధ్య గొడవగా ఉంటుంది. ఈ రెండు ట్రాకుల మధ్య సంబంధం ఉందనే విషయాన్ని దర్శకుడు హింట్ ఇస్తూ వెళుతుంటాడు. ఆ ఫ్లాష్ బ్యాక్ ఏమిటనేది తెలుసుకోవాలనే కుతూహలంతో ప్రేక్షకులు ఉంటారు. దర్శకుడు ఈ విషయాన్ని రివీల్ చేసిన తీరు కూడా బాగుంది .. ఆ ట్విస్ట్ చాలా కీలకమైనదని కూడా అనిపిస్తుంది. ఇంటర్వెల్ బ్యాంగ్ .. ఆ తరువాత కథపై ఆసక్తిని పెంచేదిలా ఉంటుంది. సెకండాఫ్ లో కార్తీక్ కోసం వరదారెడ్డి అనుచరులు గాలించడం .. అక్కాతమ్ముళ్ల ఫ్లాష్ బ్యాక్ రివీల్ అయ్యేవరకూ బాగానే అనిపిస్తుంది. ఇక ఎప్పుడైతే వెన్నెల కిశోర్ ఎంట్రీ ఇస్తాడో అప్పటి నుంచి కథ కాస్త కామెడీ వైపు టర్న్ తీసుకుని చప్పబడిపోయినట్టుగా అనిపిస్తుంది. నాగశౌర్య పాత్రను, సముద్రఖని .. మైమ్ గోపీ పాత్రలను డిజైన్ చేసిన తీరు బాగుంది. వాళ్ల నటన కూడా బాగుంది. కార్తీక్ .. అతని లవర్ కి సంబంధించిన రొమాన్స్ కి అవకాశం లేకుండా చేశారు. అందువలన ఆ వైపు నుంచి ఆడియన్స్ కి మిగిలేది నిరాశే. ఇక సాయికుమార్ పాత్రను డిజైన్ చేయడంలో కూడా క్లారిటీ లేదనిపిస్తుంది. అలాగే ఎలాంటి విషయం లేకుండా అజయ్ పాత్రను వదిలేశారు. రసూల్ ఎల్లోర్ ఫొటోగ్రఫీ బాగుంది. హారీస్ జైరాజ్ సంగీతం ఫరవాలేదు. కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటింగ్ ఓకే. కథలోని అక్కాతమ్ముళ్ల ఫ్లాష్ బ్యాక్ కి సంబంధించిన ట్విస్ట్ బాగుంది. కానీ ఎమోషన్స్ వైపు నుంచి .. యాక్షన్ వైపు నుంచి నడిచే డ్రామా రొటీన్ గా అనిపిస్తుంది. రొమాన్స్ కి ఛాన్స్ ఇవ్వకపోవడం మరో లోపంగా అనిపిస్తుంది.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143